శ్రీ రస్తు.

శ్రీ భగవద్గీతామంజరి

మంజరి.

ఇది

రాజా పానగంటి పార్థసారథి రాయనింగారు, బి. ఏ.,
రాజా ఆఫ్ పానగల్ చే

విరచితము.

చెన్నపురి:
శ్రీ 'రామ' ప్రెస్సున
ముద్రితము.
౧౯౩౧.



వేంకటరంగనృపతి.

క. అన్నియుఁ దానై తానై
యన్నిట నన్నిటికిఁ దానె యాదరువై తా
నన్నిట రేఁడై యెన్నఁడు
నున్నట్టి మఱొండు లేని యొక్కనిఁ దలఁతున్.

క. తలిదండ్రు లచ్చమాంబకు
నలవేంకటరంగ నృపతి కాదలనతులఁ
జెలుపుచె భగవద్గీతల్
దెలుఁగున రచియింపఁ బూనితిని పితృసేవన్.

శ్రీరస్తు

శ్రీ భగవద్గీతా మంజరి

మొదటి అధ్యాయము.

అర్జునవిషాదయోగము.

ధృతరాష్ట్రుఁడు పల్కె.

ధర్మభూమిని గురుస్థానంబునందు
దీక్షానఁ గోరి కూడిన పాండవులును
నావారు నేమి సంజయ, సల్పినారు ౧

సంజయుఁడు పల్కె.

వ్యూహంబు గాఁగను బొనరింపఁగఁబడి
నిల్చిన పాండవానీకముం గాంచి
యనె సుయోధనుఁడు రాజపుడు డాసి గురు

దుర్యోధనుండు పల్కె.

బుద్ధిశాలి ద్రుపదపుత్త్రుండు నీదు
శిష్యుండు తీర్పఁగాఁ జేరిన దీనిఁ
బాండుపుత్త్రుల పెనుబౌజుఁ గన్గొజ్జ ౨

ఆలంబునందు భీమార్జునులకును
సములు బల్ విలుకాండ్రిచటిమేటిమగలు,
పురజిత్తు మఱి కుంతిభోజుండు, మగల
తలకట్టు శైబ్యుండు, ద్రౌపదేయులును,
వీర్యవంతుఁడు కాశివిభుఁడు, సుభద్ర
తనయుండు, మఱి చేకితానుండు, మఱియు
యుయుధానుఁడును, వీరుఁ డుత్తమౌజుండు,
బలి యుధామన్యుండు, బల్ తేరువాఁడు
ద్రుపదుండు, ధృష్టకేతుఁడు, విరాటుండు,
అందఱుగూడ మహారథుల్ వారు ౪, ౫, ౬

మఱి ద్విజోత్తమ, నాదు మందులయొక్క
గమికాండ్రు మనవారు ఘనులు నెవరో,
వారి నెఱుఁగు, నీకుఁ బలికెదఁ దెలియ ౭
కర్ణుండు నీవు వికర్ణుండు, కృపుఁడు
సమితింజయుండును సౌమదత్తియును
ద్రౌణియు, మఱి జయద్రథుఁడు భీష్ముండు ౮
పెక్కండ్రు పెరవారు బీరంపుమగలు,
జీవముల్ నాకై త్యజించినవారు,
బహువిధంబుల శస్త్రపరికరంబులను
గొన్నవార్ భండన కోవిదు లెల్ల ౯
అల్లదె మనది, భీష్మాభిరక్షితము,
బల్లు, మపర్యాప్తంబు, వారల బలము,

పర్యాప్త మిదె భీమపరిరక్షితంబు ౧౦
మొనలనెల్లఁ దమతావులనుమీ రెల్ల
నిలుచుండి కాఁపఁగా నీభీష్మునేవలయు ౧౧
వానికి హర్షంబు ప్రభవింపఁగాను
సింహనాదము పెల్లుచేసి వీరుండు
కురువృద్ధుఁ డొత్తె సంకును బితామహుండు ౧౨
వెసనె గోముఖశంఖభేరులు మఱియు
నానకపణవంబు * లలికిడిసేయ
నయ్యెను దుములంబు నాశబ్దమంత ౧౩
తెల్లగుఱ్ఱాల పెన్తేరునందున్న
పాండవుండును నంత వాసుదేవుండు
దివ్యశంఖముల నొత్తిరి, హరి యొత్తెఁ
బాంచజన్యంబును, పౌండ్రంబు నొత్తెఁ
బెనుసంకు భీముండు భీమకర్ముండు,
దేవదత్తంబు నొత్తె ధనంజయుండు,
సహదేవుఁడు మణిపుష్పకము శబ్దించెఁ,
బూరించెను సుఘోషమును నకులుండు,
నృపతి కుంతీజుఁడయిన యుధిష్ఠిరుఁడు,
నలికిడిసేసె ననంతవిజయము,
ఘనకార్ముకుండైన కాశ్యుండు మఱియు
నపరాజితుండు సాత్యకి మహారథుఁడు
నైన శిఖండి మహాబాహుఁ డైన

* అలికిడి=శబ్దము.

సౌభద్రుఁడు మఱి ధృష్టద్యుమ్నుఁడు మఱి
ద్రౌపది తనయులు ద్రుపదుండు మఱియు
నృపతి! విరాటుండు నెల్ల ప్రక్కలను
నొత్తిరి శంఖంబు లొక్కొక్కఁడుగను ౧౮
భూనభంబులు నిండ మ్రోఁగి యాఘోష
నురిగించె ధార్తరాష్ట్రుల డెందములను ౧౯
కుతలేశ శస్త్రముల్ కురియ నుండఁగఁ
గపికేతనుం డైన కౌంతేయుఁ డంతఁ
దీరి నిల్చిన యట్టి ధృతరాష్ట్ర సేన
నీక్షించి ధను వెత్తి యీపల్కు ననియెఁ
గృష్ణునితోడ, "నో కృష్ణ నా తేరు
నుభయ సేనల మధ్య నుండఁగా నిల్పు. ౨౦, ౨౧
ఈ యుద్ధయత్నమం దెవరితో నేను
బోరంగ నౌనట్టి, పోరంగఁ గోరి,
నిలిచియుండెడి వీరి నేఁజూచు తఱిని ౨౨
దురమున దుర్మతి దుర్యోధనునకు
హర్షంబు గల్పింప నాలంబునప్ప
నిటకు వచ్చిన వీరి నేను జూచెదను." ౨౩
విజయుండు నిట్టుల వేఁడఁ గృష్ణుండు,
ద్రోణభీష్ములు నెల్ల దొరలకు నెదుట
నుభయసేనల మధ్య నుంచి బత్తేరు
వచియించె ధాత్రీశ, "పార్థ! కన్గొనుమా

గమికొని యున్న యీకౌరవుల" నని   ౨౮, ౨౭
అంతఁ బార్థుఁడు గాంచె నట నిల్చియున్న
తాతలఁ సుతుల భ్రాతల మాతులులను
మామలఁ బుత్రులఁ మనుమలఁ సఖుల
నిరుదళంబులను సుహృదులను గురుల
శ్వశురులఁ నిల్చిన బంధులనెల్ల,
నవ్వారి నీక్షించి యాకుంతికొడుకు,
పరమమౌ కృపఁజెంది వగ నిట్లు పల్కె,

అర్జునుఁడు పల్కె.

"చివ్వ సల్పఁగఁ గోరి చేరి యున్నట్టి
వీరిని మావారి వీక్షించి నాదు
గాత్రముల్ శిథిలమౌఁ గంపించె నొడలు
ముఖమెండు రోమముల్ మొనలపై నిక్కె
గాండీవ మురియాడుఁ గరముండికృష్ణ,
చర్మంబు మండు నశక్యమౌ నిలువ
మనసును భ్రమచెందు మాడ్కిఁ దోఁచెడిని
విపరీత సూచనల్ వీక్షింతుఁ గృష్ణ!   ౨౯,౩౦
స్వజనంబు ననిలోనఁ జంపి మేల్ గాంచె
కోరను విజయంబుఁ గోర రాజ్యంబుఁ
గోర సుఖముఁ గృష్ణ! గోవింద! మనకు
రాజ్యంబు భోగముల్ ప్రాణమేనేల   ౩౨
భూమియు సౌఖ్యముల్ భోగముల్ మనము

వలతు మెవ్వారికై వారలే యనిని
జేరిరి విత్తముల్ జీవముల్ విడిచి 33
తండ్రులు బిడ్డలు తాతలు గురులు
నల్లె మాతులులు వియ్యంకులు మఱియు
మామలు బావలు మనుమలు గూడ 34
త్రైలోక్యరాజ్యంబు దార్చునప్పటికిఁ
జెంప నొల్లను వీరిఁ జెంపఁ బడినను,
నిలకు మాత్రంబేని యేమి యగుఁ గృష్ణ; 35
ధార్తరాష్ట్రులఁగూల్చి దైత్యారిమనకు
నేమి ప్రీతి లభించు నీపాతకులను
వధియింపఁ బాపంబె ప్రాపించు మనల 36
గాదిలి వారితోఁ, గాఁబట్టి, మనకు
ధార్తరాష్ట్రులఁ జెంపఁ దగదు శ్రీకృష్ణ,
సుఖులమె ట్లగుదుము చుట్టాలఁగెడపి 37
కులమునాశము చేయఁ గూడు దోషంబు
మిత్రుల వంచింప మిగులు పాపంబు
పేరాస మదిచెడ్డ వీర్ గనరేని 38
కులమునాశముచేయఁ గూడు దోషంబు
నీక్షించు మనకేల యీ పాతకంబు
నుండి తొలఁగ నేరనోపని దగును 39
కులము పోవ ననాది కులధర్మములును
నడఁగును, ధర్మంబు నడఁగుట మఱియు

కులమంతట నలముకొను నధర్మంబు ౪౦
దూష్యలు స్త్రీలవుదు రధర్మ మెచ్చ
నచ్యుతా, దుర్మార్గ లైనచో స్త్రీలు
వార్ష్ణేయ, పాటిల్లు వర్ణసంకరము ౪౧
నరకంబె కలుగు సంకరమునఁ జేసి
కులమునకును మఱి కులఘాతకులకుఁ;
భిండోదకక్రియ ల్వీడుటయును
వారల పితరులు పడుదురు కాదె ౪౨
వర్ణసంకరమును బడయించునట్టి
కులఘాతకు లవి యీ *కొడిమెలవలన
శాశ్వతంబుగ నుండు జాతిధర్మములుఁ
గులధర్మములుఁ గూడఁ గూలిపోయెడిని ౪౩
అపగతకులధర్ము లౌ వారికెపుడు
నరకవాసము గల్గు నా విందుము హరి ౪౪
రాజ్యంబు సుఖమును గ్రహియించునాస
స్వజనంబు వధియింపఁ బనిఁ బూన నెంతొ
పాపంబు సేయఁ బాల్పడినార మకట. ౪౫
బాణముల్ విడనాడి బదు లేయని నను
ధార్తరాష్ట్రు లని శస్త్రకరులౌ వారు
నై- త్రుంతురే న్నాకదౌ మేల్ మఱంత ౪౬
అర్జునుం డిట్లని యాడి యుద్ధమున

* కొడిమెలు = దోషములు.

వింటిని గోలతో విడనాడి రథము
నందు శోకాకులుఁడై కూరుచుండె. ౪౭

రెండవ అధ్యాయము.

సాంఖ్య యోగము.

సంజయుఁడు పల్కె.

కడుజాలి మునిఁగి దుఃఖంబును బొంది
కొలుకులఁ గన్నీరు గుప్పు నవ్వానిఁ
గూర్చి యిట్లని పల్కె గోవిందుఁ డంత ౧

శ్రీ భగవంతుఁడు పల్కె.

"నర! విషమమునందున నకీర్తికరము
నస్వర్గ్య మైనద నార్యజుష్టంబు
నైన యీ కశ్మలం బయ్యె నీ కేల ? ౨
వలదు క్లైబ్యంబొందఁ, బార్థ నీయందుఁ
దగదది; శూర! క్షుద్రం బైన గుండె
దౌర్బల్యమును బోవఁ దట్టిలే లెమ్ము" ౩

అర్జునుఁడు పల్కె.

"పూజ్యులౌ ద్రోణభీష్ముల నని దేవ,
కోలలన్ నేను మార్కొను టెట్లు కృష్ణ ౪

పెద్దలౌ గురువుల విదళింపకుండ
భక్షింప శ్రేయంబు భైక్షమే నిటుఁగ,
నడఁతునేని గురువుల నర్థాతురతను
భుజియింతు నెత్తుటి భోగములె యిట. ౫
ఎయ్యది మనలకు నెక్కుడైనదియొ,
గెలుతుమో యెఱుఁగము గెలుతురో మనల
నెవ్వారి జంపి జీవింప వలవమొ
యాధార్తరాష్ట్రులే యని నిల్చినారు ౬
*కౌటికతనము సోఁకుఁ గొనస్వభావమునఁ
†గఱతఁ గన్గొనలేని ‡కఱదనే నిన్ను
నడిగెద శ్రేయ మెయ్యది నిశ్చితమది
చెప్పు, నీమఱుఁగుఁ జొచ్చిన వాఁడ నేను
నీకు శిష్యుండ నన్నివు శాసింపు ౭
భూమి నడ్డము లేని పూర్ణ రాజ్యంబు
త్రిదశాధిపత్యమొందియుఁ గూడ నాదు
నింద్రియంబుల నుడికించు శోకంబు
శమియించు నది చూడఁ జాలను గాదె" ౮

సంజయుఁడు పల్కె.

కృష్ణుతో నరిభీముఁ డిట్లని నరుఁడు
ఆగెఁగ నని సల్పనని హరితోడ ౯

---

* కౌటిక=లోభి. † కఱత=పని. ‡ కఱద=బుద్ధి.

దుగదళంబుల మధ్యదురపిల్లు నతని
నిట్లనె హరి హాసియించున ట్లీశ ౧౦

శ్రీ భగవంతుఁడు పల్కె.

వగచి తీవు వగసల్పఁ దగనివారి,
జ్ఞానంబు పల్కెదు, జ్ఞాను లేదువరు
జీవులకేఁ గత జీవులకేని ౧౧
ఏఁగాని నీవేని యీరాజులేని
లేని దెన్నఁడు లేదు లేదు లేకుంట
యిందఱమును గూడ నిటు తరువాత ౧౨
దేహికేరీతి నీ దేహంబునందు
బాల్య యౌవనముల్ వార్ధకత్వమును
బ్రాప్తించు దేహాంతరంబును నట్లె
పొందఁడు ధీరుండు మోహంబు నందు ౧౩
పొడము మాత్రాస్పర్శముల నర, సుఖము
శీతోష్ణదుఃఖముల్, స్థిరములుగావు,
వచ్చుచుఁ జెనుచుండు, వాని నోర్వునర, ౧౪
సుఖదుఃఖము లొకంట జూచు ధీరుండు
నగు నే పురుషు నివ్వి వ్యథఁ గొల్పలేవొ
యతఁడె గా తగుఁ బార్థ యమృతత్వమునకు ౧౫
లేదసత్తునకున్కి లేదు సత్తునకు
నుండమి, యీ రెంటియొక్క నిక్కవము
కనఁబడు తత్త్వంబుఁ గనువారిచేత ౧౬

ఇది యంత దేన నావృతమయియుండు
దాని నాశము లేని దానిఁగ నెఱుఁగు,
అవ్యయం బగుదీని నడఁగింపఁగాను
వలను గానేర దెవ్వానికి నైన ౧౭
అవినాశి యప్రమేయంబు నిత్యంబు
నౌ దేహి దేహంబు లౌ నివ్వి పార్థ,
యంతవంతములందు, రౌటఁ జేల్వు మని ౧౮
కూలుప దియ్యది కూల్పఁగాఁ బడదు;
ఎవఁడు హంతగ దీని నెంచు నాతండు
నెవ్వండు హత మని యెంచునో దీని
నా యిద్దఱునుగూడ నజ్ఞులౌ వారు ౧౯
పుట్టదు గిట్ట దెప్పుడయేని యిద్ది
ఉండియవ్వలమఱి, యుండమి లేదు
అజము శాశ్వతము నిత్యము పురాణంబు
చావ కుండెడు నిది చావఁగా నొడలు ౨౦
అవ్యయం బవినాశియజము నిత్యంబు
నని దీని నెఱిఁగిన యాతండు పార్థ!
యెతని నె ట్లడిపించు నెవనిని నడచు ౨౧
పురుషుఁ డెట్టులు ప్రాఁత పుట్టముల్ వాసి
క్రొంబుట్టముల్ దాల్చు కొనునట్లు దేహి

'ఆత్మ' కుమహద్వివక్షచేయ కుండుటే యాంధ్రసంప్రదాయమున కనుగుణము.

ప్రామేసులం బాసి పడయుఁ గ్రొత్తలను ౨౨
దీని శస్త్రములు ఛేదింప, వేర్పడును
ననలంబు, నెండింప దనిలంబు దీనిఁ,
దేమగఁజేయదు దీనిని జలము
అచ్ఛేద్య మిది యశోష్యమె యచలంబు
నక్లేద్య మిది యదాహ్యము సర్వగతము
స్థాణువు నిది సనాతనము నిత్యంబు ౨౪
కాదు వ్యక్తం బిది కాదు చింత్య మిది
యవికార్య మియ్యది యందురు, గాన
నిటు దీని నెఱిఁగి శోకింపఁగాఁ దగవు ౨౫
నిత్యంబుఁ బుట్టుచు నిత్యంబుఁ జెనుచు
నుండు నంచును దీని నూహింతువేని,
ఏడ్వరా దట్లయ్యు నీ విట్లు వీర ౨౬
పుట్టిన వానికి బ్రుంగుట విడదు
బ్రుంగిన వానికిఁ బుట్టు వీడదుగ,
అవుటచేఁ దప్పింప నలవిగానట్టి
దానికిఁ గా నీవు తగవు శోకింప ౨౭
భూతముల్ గనరాని మొదలు గల్గినవి
కనరాని తుదవియె గనవచ్చు నడుమ,
భారత,యం దేమి పరిదేవనంబు ౨౮
కాంచు దీనిని వింతఁగా నొక్కరుండు,
నట్లె వింతఁగ దీని నన్యుఁడు పల్కు

వింతఁగా నే దీని విను మఱి యొకఁడు;
ఎఱుఁగఁడు విన్నను నెవఁడును దీని ౨౯
అన్నింటి దేహంబు లందుండు దేహి
యిది యవధ్యము పార్థ యెప్పుడు, గానఁ
దగవు నీ కఖిలభూతంబులు వగవ ౩౦
తగవు స్వధర్మంబుఁ దలపోసి యైనఁ
గంపింప, ధర్మ్య మౌ కలనకన్నఁగద
శ్రేయ మొం డొకటి క్షత్త్రియునకు లేదు ౩౧
తనయంతఁ దాన ప్రాప్తం బైన యిట్టి
బవరంబు, తెఱచిన వాకిలి గలుగు
స్వర్గ మౌ! నది సుఖవంతు లౌ నట్టి,
క్షత్త్రియులకుఁ బార్థ సంప్రాప్త మౌను ౩౨
సల్పవే నీ ధర్మ్యసంగ్రామ మీవు,
నీదు ధర్మంబును నీ దగుకీర్తిఁ
బోనాడి పాపంబుఁ బొరయఁగాఁ గలవు;
అందఱు నీదగు నవ్యయం బైన
యపకీర్తి వాక్రుత్తు, రపకీర్తి యగును
జావు కన్నను మింపు సంభావితునకు ౩౪
భయముచే రణమును వదలితి వంచుఁ
దలఁచెదరు మహారథముల వారు నినుఁ
బహుమతుండవు ము, న్నెవరిలోన వారి
యందున లాఘవం బలవడు నీకు ౩౫.

నీదు సామర్థ్యంబు నిందించు నీదు
పగవార లనరాని పల్కులం ద్రెన్నొః
యంతకన్నను దుఃఖ మధికమే ముండు.
హతుఁడ వైనను స్వర్గ మలవడు నొండె,
నవని నేలెదవు గెల్పయినచోఁ, గానఁ
గదనంబునకుఁ బూని కౌంతేయ లెమ్ము
సౌఖ్యంబు దుఃఖంబు జయము నజయము
లాభనష్టములఁ దుల్యంబులఁ జేసి
పోరఁ బూను మఘంబురఁ బొందవల్లైన
సాంఖ్యంబులోని యీజ్ఞానంబు నీకు
బోధితం బయ్యె, నేబుద్ధితోఁ గూడఁ
గర్మబంధంబులఁ గడవంగఁ గలవొ,
యట్టి యీయోగంబు నాలింపు; పార్థ.
* దొరకోలు చెడడిందు దోసంబు లేదు,
ఈధర్మ లేశంబు † నేర్చుఁ బెకా బీతు
అచల మౌ నొక్కటి యగుబుద్ధియందు
నర్జునా, యయ్యేడు నస్థిరాత్మునకుఁ
గొనలేని పలుతెఱంగుల బుద్ధులు గద
ఐశ్వర్యభోగంబు లందఁగాఁ దలఁచు
నానాక్రియల్ గల్గిన యదియు నైన
పుట్టు కర్మమున కవును ఫలం బనె

---

* దొరకోలు=యత్నించుట. † ఏర్చుఁ= చక్కఁబఱుచు.

వేదవాదరతులు, వేరు లే దనుచు
స్వాదుగాఁ బల్కెడు పండితుల్ దాన
నపహృతచేతస్కు లౌ నట్టి వారు,
నైశ్వర్యభోగంబు లాశించువారు,
కామాత్మకులును, స్వర్గపరు లౌ వారు,
చెందలేరు సమాధి స్థిరబుద్ధిఁ బార్థ ౪౪
వేదముల్ త్రైగుణ్య విషయముల్ పార్థ,
త్రైగుణ్యములఁ బాసి ద్వంద్వముల్ వీడు,
యోగంబు క్షేమంబు నుజ్జన సల్పు,
మగు నిత్యసత్వస్థుఁ డాత్మవంతుఁడవు. ౪౫
నలుదెసల్ జలము పొంగారు సరస్సు
నం దెంత ఫలముండు నఖిలవేదములను
జ్ఞాని యౌ బ్రాహ్మణునకు నంతె ఫలము. ౪౬
కర్మ మందే యధికార మెప్డేని
కాదు ఫలంబులం గలది నీ, కీవు
కర్మంబు ఫలహేతుకంబు గా నీయ
వల, దకర్మంబునఁ గావలదు సంగంబు. ౪౭
యోగివై సంగంబు నూడిచి విజయ,
సిద్ధ్యసిద్ధుల నొంటిఁ జేసి కర్మంబు
నాచరింపు సమత్వ మంద్రు యోగంబు ౪౮
కడు లొచ్చు బుద్ధియోగము కన్నఁ జేత,
ఫలముఁ జూచెడు వారు పార్థకృపణులు,

బుద్ధియోగమునందుఁ బొందుము శరణు ౪౯
బుద్ధియుక్తుఁడు త్రోయుఁ బుణ్యపాపముల
భువిఁ, గాన యత్నింపు బుద్ధియోగంబు,
కౌశలం బగును యోగము కర్మములను ౫౦
బుద్ధిఁ గూడిన మానవుల్ కర్మజ మగు
ఫలము విడిచి జన్మబంధముక్తులయి
యందుదురు గదా యనామయపదవి ౫౧

ఎపుడు మోహకలిల మీఁదు నీ బుద్ధి,
వినిన దానిదియును వినఁగల దాని
వైరాగ్య, మప్పుడు పడయఁగాఁ గలవు ౫౨
శ్రవణము వలన విప్రతిపన్నమైన
యట్టి నీబుద్ధి సమాధి నిల్కడగ
స్థిరముగా నెప్పుడు చేరియుండెడినో
యప్పుడు యోగంబు నందెదవీవు. ౫౩

అర్జునుఁడు పల్కె.

ఆర్యా! సమాధిస్థుఁ డౌ స్థితప్రజ్ఞు
తీరేమి, యే మనుస్థితబుద్ధి, యెట్లు
నతఁడు గూర్చుండునే యనువున నడచు. ౫౪

శ్రీభగవంతుఁడు పల్కె.

మనమునందుండు కామంబులనెల్ల
సవ్యసాచి, యెపుడు చెక్కఁగా విడిచి,

త్మచే నాత్మనే యానంద మొందు
డౌ, నపుడు స్థితప్రజ్ఞుఁ డనఁబడు ౫౫
ంబులను మదిఁ దొందర లేని,
ముల వలనను సోఁకు లేనట్టి,
రాగభయముల్ గూడనివాఁడు,
ముని స్థిరబుద్ధి యని వచించెదరు. ౫౬
మైనఁ బొంగఁడు సోలఁడు కీడు
ాడ, నెందేని చెలిమి చేయండో,
డ్రు ప్రతిష్ఠిత మాతని ప్రజ్ఞ. ౫౭
ప్రక్కలఁ గూర్మ మంగముల్ ముడుచు
ంద్రియము లింద్రియార్థంబు లందు
ష్టి యాతం డెప్పు డుడిగించు, నపుడు
నిదో ప్రజ్ఞ యౌఁ బ్రతిష్ఠితము. ౫౮
ును రసము తప్పఁగ విషయములు
ారహీనుండు నౌ దేహి, నతని
ును విడుచుఁ బరముఁ గాంచఁగాను. ౫౯
నా! యత్నించు నతఁ డయ్యుఁ గూడఁ
జ్ఞుని మనమును బలవంతముగను
చు నుద్ధతములు నౌ నింద్రియములు. ౬౦
ి నన్నింటిని బద్ధముల్ సేసి
ము యుక్తుండు మత్పరుఁడుగఁ గాఁగ,
ద్రియంబులు తన కెవనికి లోను

నాతని ప్రజ్ఞగా యాఁ బ్రతిష్ఠితము. ౬౧
ధ్యానింప విషయంబు లగువానియందు
సంగంబు నరునికి, సంగంబువలనఁ
గామంబు గల్గెడుఁ, గామంబు వలనఁ
గ్రోధంబు ప్రభవించుఁ, గ్రోధంబువలన
మోహంబు పుట్టెడు, మోహంబువలన
స్మృతివిభ్రమం బౌను, స్మృతివిభ్రమమున
బుద్ధి నాశముఁ జెందు, బుద్ధినాశంబు
వలన వినాశంబు ప్రాప్త మయ్యెడిని ౬౩
ద్వేషంబు రాగంబు విడనాడి తనకు
నణఁగిన వగు నింద్రియంబులతోడ
విషయంబు లందుఁ బ్రవేశించు నట్టి
వశ్యాత్మునకు నలవడుఁ బ్రసాదంబు. ౬౪
నీల్గు వాని వెత లన్నియుఁ బ్రసాదమునఁ,
జెచ్చెరనె ప్రసన్న చేతస్కు నకును
బుద్ధి స్థిరత్వంబుఁ బొందిన దౌను. ౬౫
లేదు భావన బుద్ధి లే దయుక్తునకు,
భావన లేనట్టి వానికి లేదు
శాంతిః సౌఖ్యంబు నశాంతున కెట్లు? ౬౬
ఏ మనంబు చరించు నింద్రియంబులకు
వశమై యది హరించు వాని దౌ ప్రజ్ఞ,
నుదకమం దనిలంబు నోడను బోలె. ౬

జౌటఁ, బ్రతిష్ఠితం బగు వాని ప్రజ్ఞ
యెవని యింద్రియములు నింద్రియార్థముల
వలన వీర, మరలింపఁబడు నంతటను ౬౮

అఖిలభూతంబుల కగు నెద్ది రాత్రి
యందు మేల్కాంచె సంయమి, చూచే మునికి
భూతముల్ వేచు నెప్పుడు రాత్రి యద్ది. ౬౯

ఆపూర్యమాణంబు నచలంబుగాను
నుండు సంద్రముఁ జేరు నుదకంబు రీతి
నెవనిలోఁ గోర్కెలె *ల్లెలయు నాతండు
నందు శాంతిని, బడయఁడు కామకామి. ౭౦

మమతయు నహమునుం బాసిన వాఁడు
కాముంబు లన్నింటిఁ గడచి నిస్పృహత
వర్తించు నాతండు పడయును శాంతి. ౭౧

బ్రాహ్మీస్థితి యిది యహాఁ బ్రాపించి దీని
మోహంబు పొందఁడు, ముగియు కాలంబు
నందును నీ స్థితి యం దున్నఁబార్థ
బ్రహ్మనిర్వాణంబుఁ బడయంగఁ గలఁడు. ౭౨

---

* ఎలయు = ప్రవేశించు.

మూఁడవ అధ్యాయము.

కర్మయోగము.

అర్జునుఁడు పల్కె.

కఱతకన్న నెఱుక ఘనమని కృష్ణ
నీమతం బయినదేని హరి నన్నేల
యా ఘోరకర్మంబునందు నిల్పెదవు. ౧
వ్యామిశ్రముగ నున్న వాక్యంబుచేత
నా బుద్ధి మోహ మందఁగఁ జేయు నటుల
నున్నావు దృఢముగా నొక్కటి చెపుమ
శ్రేయంబు దేని నేఁ జెంద నౌ దాని.

శ్రీ భగవంతుఁడు పలికె.

ఈ లోకమున నిష్ఠ యిరు తెఱంగులను
గలదని మున్ను నేఁ గఱపితి ననఘ,
యోగులకును గర్మయోగంబుచేత
జ్ఞానయోగంబుచే సాంఖ్యుల కనియు. ౩
నైష్కర్మ్య మొందఁడు నరుఁడు కర్మంబు
మొదలు పెట్టమిచేతఁ, బొందంగలేడు
మఱి సన్న్యసించిన మాత్రాన సిద్ధి. ౪
క్షణమైన నెపుడేని కర్మంబు గొనక
యుండఁగ నెవఁడేని యుండఁడు గాదె,

యవశంబు గాఁగను నందఱు, ప్రకృతి
సిద్ధించు గుణములచేతఁ, గర్మంబు
నాచరింపంగఁ జేయఁబడుదురు గద ౫
కర్మేంద్రియంబులం గట్టి యెవ్వండు
నింద్రియార్థములఁ స్మరించుచుండు నెద
నా విమూఢాత్ము మిథ్యాచారుఁ డండ్రు. ౬
ఇంద్రియంబులఁ బార్థ, యెద నియమించి
కర్మేంద్రియములచేఁ గర్మయోగంబు
నాను నెవ్వఁ డసక్తుఁ డై వాఁడు మిగులు. ౭
కర్మ మెక్కుడుగ యకర్మముకంటె,
కావింపుము నియతకర్మ, మచేష్ట
శారీరయాత్రయు జరుగదు నీకు. ౮
యజ్ఞార్థ మగుచేత కన్న నొం డయిన
దానను గర్మబద్ధ మిది లోకంబు,
కొటచే నర, కర్మ మంటక సలుపు. ౯
కల్పించి ప్రజల యజ్ఞంబులతోడఁ
పలికె మునుపు ప్రజాపతి యిట్టు లనుచు
వృద్ధిని బొందుఁడు వీనిచేఁ నివ్వి
కావుత మీ కిష్ట కామధేనువుగ. ౧౦
దేవతలకుఁ దన్వి దీన నిండల్ల
దేవతలును మీకుఁ దృప్తిగావింత్రు,
ఒకరి నొక్కరు తృప్తి నొందించువారు

నై పరం బగు శ్రేయ మందెద రీరు. ౧౧
యజ్ఞంబులను దృప్తు లయిన దేవతలు
నిత్తురు గద మీకు నిష్టభోగముల,
వారియీ యీవుల వారికి నీక
యనుభవించునో యెవం డతఁడు దొంగయగు ౧౨
యజ్ఞ శిష్టం బైన దాను సుకృతులు
పాపంబు లన్నింటి వలనఁ బాయుదురు
పాకంబు తమకుఁ గాఁ బచేరించునట్టి
పాతకుల్ పాపంబె భక్షించువారు. ౧౩
భూతంబు లన్న సంభూతంబు లగును,
ప్రభవించు నన్నంబు వర్షంబువలన,
వర్షంబు యజ్ఞంబు వలనను బుట్టు,
యజ్ఞంబు కర్మముం దావిర్భవించు. ౧౪
బ్రహ్మంబువలనఁ గర్మము సంభవించు,
బ్రహ్మ మక్షరసముద్భవము నా నెఱుఁగు,
కావున నన్నింటఁ గలుగు బ్రహ్మంబు
యజ్ఞంబునం దెప్పుడేఁ బ్రతిష్ఠితము. ౧౫
ఎవఁ డనువర్తింపఁ డిట నిట్లు జెరుగు
చక్రంబు నా పాప జన్ముండు పార్థ,
వ్యర్థ మయ్యెడు నింద్రియారాముఁడు మని. ౧౬
ఆత్మయందే యెవ్వఁ డానంద మొందు
నాత్మనే సంతుష్టి నాత్మనే తృప్తి,

గాంచు, నా నరునకొ కార్యంబు లేదు: ౧౭
కృతమునఁ గాని యకృతమందుఁ గాని
యతనికే యర్థంబు నైన లేదిచేటఁ,
బొడచూప దతనికి భూతంబులందు
నెందేనియును నాశ్రయింప నౌ న దెది. ౧౮
కర్తవ్య మగునట్టి కర్మవుం గాన
సంగంబు విడనాడి సతతంబు సలుపు;
గతసంగుఁ డగుచును గర్మముఁ జేలుపు
పురుషుండు పరమును బొందెడుఁ గాదె. ౧౯
సంసిద్ధి నొందిరి జనకాదులు కద
కర్మవుచేన; నోఁ గావింప నీకు
లోకసంగ్రహము విలోకించి యైన
శ్రేష్ఠులు నేదేది చేయుదు రదియె. ౨౦
యితరు లా జను లొనరింతురు, వారు
కెంద్రు ప్రమాణంబు గాను నెద్దాని
నయ్యదె లోకులు ననుసరించెదరు. ౨౧
కల్గ దేమియుఁ ద్రిలోకంబుల నాకుఁ
గర్తవ్య మగు నది గాని పొందంగఁ
బడనట్టి యదిగాని పడయఁ దగినది
యే నయ్యుఁ గర్మవందే యుందుఁ బార్థ ౨౨
ఏఁ బరా కొందక యెప్పుడేని కఱత
యుం దుండ కుందునే ననుసరింతురుగ

మనుజు లన్నింట నా మార్గంబుఁ బార్థ. ౨౩
ఏఁ జేత సల్పనే నీ లోకములును
నడఁగు, సంకరమున కగుదును గర్త,
పడఁ గొట్టువాఁడ నీ ప్రజలనే నేను. ౨౪
కఱతఁ దగుల్ గల్గి కావింతు రెటుల
నజ్ఞు, లసక్తుఁ డై యట్లె జ్ఞాని నర
కావించు, లోకసంగ్రహ *మించి సలుప. ౨౫
కర్మసంగు లయిన జ్ఞానహీనులకు
బుద్ధిభేదంబును బుట్టింప రాదు,
సకలకర్మంబులఁ జెల్వఁ జేయఁ దగుఁ
జెల్వుచే యుక్తుఁ డై జ్ఞాని యౌ వాఁడు. ౨౬
ప్రకృతి గుణంబుల వలన నన్నింట
నాచరింపఁగఁ బడు నవ్వి కర్మములు,
తాను గర్త యటంచుఁ దలపునేసెడును
†హంకారమున మోస మందిన వాఁడు. ౨౭
గుణకర్మభేదంబు కొలఁది తత్త్వంబు
తెలియువాఁ డర్జునా, తెంచు సంగంబు,
నడచు గుణములం గుణములు నా నెఱిఁగి. ౨౮
ప్రకృతిగుణంబుల భ్రమ మొందు వారు
గుణముల చేతలం గొనుదురు తగులు,

* ఇంచు = ఇచ్ఛగించు.

† హంకారము = అహంకారము.

సర్వజ్ఞుఁ డగువాఁడు చేన దల్ల యేమి
తెలియని మందులం జికమక పెట్ట. ౨౯

అన్ని కర్మముల నాయందుఁ ద్యజించి
యాత్మయందు మనస్సు నమరించి మమత
యాసయు నుడిగిన యట్టివాఁడవయి
భండనం బొనరింపు జ్వరము లేకుండ. ౩౦

ఈ నాదు మతమును నే నూనవులును
నాచరించెడి వార లనుదినం బట్టి
శ్రద్ధధాను లసూయ చేననట్టివార్ కూడఁ
గర్మవు నుండియుఁ గడవంగఁ గలరు. ౩౧
ఈ నాదుమతమును నెవ్వారు మిగుల
*నిడుగడ నడుపరో యేమియుఁ దెలివి
లేనివారలు బుద్ధి లేనట్టి వారు
చెడిన వా రని తెలిసికొను మీవు; తన
ప్రకృతికిఁ దగినట్లు వర్తించు జ్ఞాని
కూడను, భూతముల్ కూడెడుఁ బ్రకృతి,
నిగ్రహంబున నేమి నెఱవేఱుఁ గలదు. ౩౨, ౩౩
ఎల్ల యింద్రియముల యింద్రియార్థముల
కడ నుండు ద్వేషరాగంబులు నిల్చి,
యా రెంటికిని వశం బౌట కారాదు,

* ఇడుగడ = అసూయ.

*వాని కా రెండును బగతు రౌఁ గాదె 3౪
తనరఁ జెల్పిన పరధర్మమ్ము కన్న
నౌ మేల్ స్వధర్మంబు, నయ్యు విగుణము.
నిధనంబు శ్రేయంబు నిజధర్మ మందుఁ
బరుల దౌ ధర్మంబు భయము గల్గించు 3౫

అర్జునుఁడు పల్కె.

ఐన దేన నియుక్తుఁ డై మానవుండు
బలవంతపఱుపంగఁ బడినట్టు లితఁడు
వలవకయే చేయుఁ బాపంబుఁ గృష్ణ. 3౬

శ్రీభగవంతుఁడు పల్కె.

అది రజోగుణజంబు నైన కామ మది
క్రోధమంతయును మ్రింగునది పెఱ † గసటు
ఎఱుఁగుము దీనిని నిట వైరిగాను. 3౭
ముఱికిచే నద్దంబు పొగచేత నిప్పు
మాయచేఁ బిండంబు మఱుఁ గొంది యుండు
నట్టుల దానిచే నావృతం బిదియు 3౮
పార్థ జ్ఞానుల కెప్డు వైరి యౌ దీన,
నిండంగ రాని దౌ నిప్పగు నట్టి
కామరూపంబున, జ్ఞాన మావృతము. 3౯
దీనికి మనము నింద్రియములు బుద్ధి

---

* వానికి = ఆపురుషునికి.

† కసటు = పాపము.

తా వండ్రు, వీనిచేత నిది జ్ఞానమును
బురికొని దేహుల మోహింపఁ జేయు. ౪౦
ఇంద్రియంబుల మున్ను నీవు నిల్గట్టి,
పార్థ, యట్లొటచేఁ, బాపవంతంబు
జ్ఞానవిజ్ఞానముల్ నాశంబు గొలుపు
నట్టి దా దీనిని నడుగంటఁ జేయు. ౪౧
అండ్రు పరము లింద్రియము లని, పరము
నగు నింద్రియంబుల కన్న మనంబు,
బుద్ధిపరము మనమునకన్న, నేది
బుద్ధికన్నఁ బరత్వమున నా నది యది. ౪౨
బుద్ధికన్నను బరంబు నగు దాని నిట్లు
తెలిసి యాత్మను నాత్మఁ దిరము గావించి
కామరూపంబును గష్టసాధ్య మగు
వైరిని జెంపుము బాహుబలాఢ్య. ౪౩

నాల్గవ అధ్యాయము

జ్ఞానయోగము.

శ్రీభగవంతుఁడు పల్కె.

ఇనున కవ్యయ మైన యీ యోగ మేను
బోధించి నాఁడను, బోధించె నినుఁడు

మనువు, కిక్ష్వాకునకు మనువు బోధించె. ౧
వరుసగ నీ రీతి వచ్చిన దీని
నెఱుఁగుదుర్ రాజర్షు, లిటనశియించెఁ
బార్థ, యా యోగంబు బహుకాలమునకు. ౨
నాకు భక్తుండవు నాకు సఖుఁడవు
నగుటచేతనె రహస్యంబు శ్రేష్ఠంబు
నైన పురాతనం బైన యోగంబు
దీనినె నీ కిప్డు తెలిపితి నేను. 3

అర్జునుఁడు పల్కె.

పుట్టితి వెనుకీవు మునుపు నినుండు
పుట్టెను ముందు నీవు గఱపి తనుట
యిది యెట్టు లయ్యెడు నెఱుఁగఁగా వలయు. ౪

శ్రీభగవంతుఁడు పల్కె.

పెక్కులు పుట్టువుల్ విజయ, రైన యవి
నావియు నీవియు నా కవి యన్ని
యెఱుక యాఁ గౌంతేయ, యెఱుఁగవు నీవు. ౫
అవ్యయాత్ముఁడ నయ్యు నజుఁడను నయ్యు
నే భూతముల కయ్యు నీశు, జనింతు
నే నా ప్రకృతి నధిష్ఠించి నా మాయ. ౬
ధర్మ మెప్పు డెపుడు తక్కువ యగునో
యెడరు నధర్మంబు, నత్తఱి విజయ,

సృజియించే వాఁడను నే నన్నుఁ గాదె, ౭
సాధువులను బ్రోవఁ జెదుప దుష్కృతుల
ధర్మంబుఁ జెక్కఁగా స్థాపించు కొఱకుఁ
బ్రతియుగంబున నేను బ్రభవించువాఁడ. ౮
నరుఁడ, నా దివ్యజన్మంబు కర్మంబు
నెవఁడు తత్త్వంబుగా నెఱుఁగు నీ రీతి
దేహంబు విడనాడి తిరిగి జన్మంబు
పొందఁడు, నాతండు పొందెడు నన్ను. ౯
క్రోధరాగభయముల్ గూడని వారు
నను జేరినట్టివార్ జ్ఞానతపమునఁ
బరిశుద్ధు లయినట్టి వారు మన్మయులు
నాదు భావము పొందినారు పెక్కండ్రు. ౧౦
ఎవరు నన్ జేరెద రెట్లు నే వారి
నట్టులే ప్రోచెద, నన్నింట జనులు
నాదు మార్గంబున నడుతురు పార్థ. ౧౧
కర్మసిద్ధిని గాంక్ష గలిగిన వారు
పూజింతు రిట వేలుపులఁ, గల్గుఁగాదె
కర్మసిద్ధి నరలోకంబున వేగ. ౧౨
గుణకర్మభాగంబు కొలఁది వర్ణముల
నాల్గింటి సృజియించినాఁడను నేను,
దాని కే నయ్యుఁ గర్తను, నవ్యయుండ
ననియుఁ నేఁ గర్తఁ గా ననియు నెఱుఁగుము. ౧౩

కర్మఫలముఁ గోరఁ, గర్మముల్ నన్ను
నంట, వేఁ డెఱుఁగు నీ యనువున నన్నుఁ
గర్మములను వాఁడు కాఁడు బద్ధుండు. ౧౪
ముక్తిఁ గోరినయట్టి పూర్వులు గూడఁ
గర్మ విట్టు లెఱింగి కావించినారు,
కావున నీవును గావింపు మునుపు
మునుపటి వారలు పొనరించిన పనె. ౧౫
కర్మ మే దేది యకర్మ మనియెడి
చోఁ బండితులకేని సుడివడుఁ దెలివి;
యే యె దెఱింగిన నెడయుదు కీడు
నుండి, నీ కా కర్మ ముగ్గడించెదను. ౧౬
కర్మము లౌ నెఱుఁగ, వికర్మము లగు
నెఱుఁగ, నకర్మము లెఱుఁగ నౌఁ గాదె;
కష్ట మౌ నెఱుఁగంగఁ గర్మముల గతి ౧౭
కర్మవులందు నకర్మంబు నెవఁడు
కను నకర్మంబులఁ గర్మవు, వాఁడు
బుద్ధిమంతుఁడు మానవులను యుక్తుండు,
కర్మము లన్నియుఁ గావించువాఁడు. ౧౮
అఖిలయత్నంబుల నంట వెవ్వనికి
సంకల్పకామముల్, జ్ఞానాగ్నిలోనఁ
గాల్పంగఁ బడినట్టి కర్మముల్ గల్గు
వానిని జ్ఞానులు పండితుఁ డండ్రు. ౧౯

కర్మఫలంబునఁ గతసంగుఁ డగుచు
నేయాశ్రయము లేక తృప్తుఁడై యెపుడు
కర్మములను వాఁడు కడు మెలఁగుచును
నుండియు నించుకే నొనరింపఁ డతఁడు. ౨౦
ఆపి చిత్తాత్మల నాశల విడిచి
కైకోను టెల్లయుఁ గడచి, దైహికపు
కర్మమంతె యొనర్పఁ గలుష మొందండు. ౨౧
తనయంతఁ దొరికిన దానితోఁ బొంగి,
ద్వంద్వముల్ దాఁటి మత్సరము పోనాడి,
సిద్ధ్యసిద్ధుల యందుఁ జిత్త మొక్కటిగఁ
గర్మ మొనరిచియుఁ గాఁడు బద్ధుండు. ౨౨
ముక్తుఁడై సంగంబు పోయిన వాని
జ్ఞానమందు మనస్సు నాటినవాని
యజ్ఞంబు కొఱకయి యాచారము గల
వాని కర్మం బెల్ల ప్రవిలయ మగును. ౨౩
బ్రహ్మ యగాను హవిస్సు బ్రహ్మ యర్పణము
బ్రహ్మచే హుతమగు బ్రహ్మాగ్నియందుఁ
గర్మ మెల్లయు బ్రహ్మగాను భావించు
వానికి బ్రహ్మంబె పడయనగు నది. ౨౪
యోగులు నొక కొంద ఱొనరించు వారు
దైవ యజ్ఞంబు, కొందఱును బ్రహ్మాగ్ని
యందు యజ్ఞంబును యజ్ఞంబుచేన

హోమం బొనర్చెద, రొరులు శ్రోత్రంబు
మున్నగు నింద్రియంబుల సంయమాగ్ని
వేల్తురు, శబ్దాదివిషయముల్ మఱియుఁ
గొందఱు నింద్రియాగ్నుల వెలిచెదరు ౨౫, ౨౬
ఇంద్రియకర్మంబు లెల్లఁ బ్రాణంపు
కర్మంబులను గూడ జ్ఞానదీపితము
నగునట్టి యాత్మసంయమ యోగవహ్ని
హోమంబు సేయుదు రొక్క కొందఱును ౨౭

ద్రవ్యయజ్ఞంబు స్వాధ్యాయ యజ్ఞంబు
జ్ఞానయజ్ఞము తాపస మగుయజ్ఞంబు
నొనరింతు రొరులట్లె యోగయజ్ఞంబు
చేలుపుదురు యతులు సంశితవ్రతులు ౨౮

పరులు ప్రాణాయామ పరులును నైన
యట్టి వా రాపి ప్రాణాపాన గతులఁ
బ్రాణంబునందు నపానంబు మఱియుఁ
బ్రాణంబు వేల్తు రపానంబు నందు ౨౯
అశననియతి గలయట్టివా రొరులు
ప్రాణముల్ వేల్తురు ప్రాణంబులందు.
వీ రెల్లరును యజ్ఞవిదులు యజ్ఞమునఁ
బాపంబులను నెడఁ బాసినవారు. ౩౦

యజ్ఞశిష్టం బైన యమృతంబుఁ గ్రోలు
వారు సనాతన బ్రహ్మమొందెదరు.

యజ్ఞంబు చేయని యతని కిహంబు
నమరదు, తక్కిన యది యేడ విజయ 3౧

బహువిధ యజ్ఞముల్ బ్రహ్మముఖంబు
గా నిట్లు ప్రబలెను గనుమవి యెల్ల
కర్మంబువలనను గలిగె నా నిట్లు
కాంచి మోక్షంబును గలవు పొందంగ 3౨

ఘనమగు ద్రవ్యయజ్ఞంబున కన్న
జ్ఞానయజ్ఞము మీర, జ్ఞానమందు నర,
యఖిల మౌ కర్మంబు నంత మౌ నెల్ల 33

ప్రణిపాతమునఁ బరి ప్రశ్నచే సేవ
నెఱుఁగుము దాని, వచింపఁగాఁ గలరు
దేని నెఱింగినఁ దిరిగి మోహంబు

ని ట్లొందవో, దేన నెల్ల భూతముల
నాత్మఁ గందు, వట నాయందు, నీ కట్టి
జ్ఞానంబుఁ దత్త్వంబు కను జ్ఞానులు నర. 3౫

పాపులలో నెల్ల ప్రబల మౌ పాపి
యగుదేనియు నెఱుక యను తెప్ప చేస
నీఁదంగఁ గలిగెద వెల్ల పాపమ్ము. 3౬

మండెడి నిప్పెట్లు మండల బూది
గావించు నట్టుల జ్ఞానాగ్ని యన్ని
కర్మంబులను బూది గావించు విజయ. 3౭

జ్ఞానంబుతో సరిగాఁ బవిత్రంబు
కల్గదుగా యిటః కాలంబు నందు,
యోగసంసిద్ధిని నొందిన వాఁడు
తనయందుఁ గాంచెడు దానిని దానె. ౩౮

సంయతేంద్రియుఁడును శ్రద్ధ గలాఁడు
పడయు జ్ఞానంబుఁ దత్పరుఁడు నౌ వాఁడు,
జ్ఞానమొంది యచిరకాలంబు లోనఁ
బరమ మౌ శాంతిని బడయంగఁ గలఁడు. ౩౯

శ్రద్ధ లే నట్టియు జ్ఞానంబు లేని
సంశయాత్ముఁడు చెడు, సంశయాత్మునకు
లే విహపరములు లేదు సుఖంబు. ౪౦

యోగంబుచేఁ జేత లుడిగిన వాని
జ్ఞానంబునఁ గతసంశయుఁ డైన వాని
నాత్మవంతుండును నై నట్టివానిఁ
గర్మముల్ బంధింపఁ గానవు పార్థ. ౪౧

కావునఁ బార్థ యజ్ఞాన జాతంబు
నై యెద నుండు నీ దైన ఈ శంక
జ్ఞానాసిఁ ద్రెంచి యోగము బూను లెమ్ము. ౪౨

ఐదవ అధ్యాయము.

కర్మసన్న్యాసయోగము.

అర్జునుఁడు పల్కె.

కర్మసన్న్యాసంబుఁ గంసారి, మరల
యోగంబుఁ బొగడెద వొకటి గుర్తించి
చెప్పుము నా, కెద్ది శ్రేయ మీ రెంట. ౧

శ్రీభగవంతుఁడు పల్కె.

కర్మసన్న్యాసంబు కర్మయోగంబు
రెండునుగూడ నిశ్శ్రేయస మిచ్చుఁ,
గర్మసన్న్యాసంబు కన్నను ఘనము
నగుఁ గర్మయోగంబు నా రెంటఁ గూడ. ౨
కోపింపఁ డెవ్వండు కోరఁ డెవ్వండు
నాతండు నిత్యసన్న్యాసి నా నెఱుఁగు,
ద్వంద్వముల్ లేనట్టి వాఁడు సుఖముగ
బంధంబులనునుండి పాయుఁగా శూర. 3
ఒకటి సాంఖ్యము మఱి యొకటి యోగమని
బాలు రందురు గాని పండితు లనరు,
చేక్కఁగా నొకటైన సాధించు వాఁడు
ఫలము రెండింటిది పడయఁగాఁ గలఁడు. ౪

సాంఖ్యంబుచేఁ గల్గు *చెక్కి యోగంబు
వలనఁ గూడను నలవడఁగను గలదు
యోగంబు సాంఖ్యంబు నొక్కటిగాను
జూచు నట్టియతండె చూచెడివాఁడు. ౫
సన్న్యాసమొందఁ గష్టంబు యోగంబు
పొందక, యోగి యౌ మునియు బ్రహ్మంబు
శీఘ్రంబె యర్జునా, చెందఁగాఁ గలఁడు. ౬
విజితేంద్రియుండును విజితాత్ముఁడు మఱి
పరిశుద్ధ మౌ నాత్మవాఁడును యోగి
యఖిల భూతాత్మ యౌ నాత్మగలాఁడు,
చేయుచుండియుఁ గూడఁ జెందఁడు సోఁకు. ౭
కూర్కుచుఁ గనుచు మూర్కొనుచు నంటుచును
వినుచును దినుచు నూపిరిని గొనుచును
గొనుచు విడుచుచుఁ బల్కుచును జనుచును
గనులను దెఱచుచు గాని మూయుచును
నింద్రియార్థంబుల నింద్రియంబులును
మలసెడు నను నది మదిలోన నిలిపి,
యొనరించు నద్ది లే దొక్కటే నేను
నని, యుక్తుఁడై యెంచె నగుఁ దత్త్వవిదుఁడు. ౮, ౯
బ్రహ్మంబునందుఁ గర్మంబుల నిల్పి
సంగంబు విడనాడి సలిపెడు నెవఁడు,

---

*చెక్కి = స్థానము.

తామరాకును నీరు తాకని పగిది,
పాపంబువలనను వాఁ డంటఁ బడఁడు. ౧౦
బుద్ధి మనఃకాయములఁ గేవలంబు
నింద్రియంబులచేత నేనియుఁ గాని
యోగులు కర్మంబు నొనరింతు, రాత్మ
శుద్ధికొఱకు నఘ సోఁకును విడిచి. ౧౧
కర్మఫలంబును గడచి యుక్తుండు
నౌ వాఁడు నైష్ఠికం బౌ శాంతిఁ గనును.
కామంబు పురికొల్పఁగా ఫలాసక్తి
కలిగి యయుక్తుండు కట్టువడెడిని. ౧౨
మనసుచే సర్వకర్మంబుల విడిచి
చేయింపకుండను జేయకయయును
దొమ్మిది వాకిళ్ల తోనుండు పురిని
హాయితోడను వశి యవుదేహి యుండు. ౧౩
కర్తృత్వమును గాని కర్మముల్ గాని
కలిగింపఁడు పతి లోకమునకుఁ గఱత
పంట కూడికగాని, ప్రకృతియే పఱచు. ౧౪
ఎవని పాపముఁ గాని యెవని పుణ్యంబుఁ
గాని కాఁడు విభుండు కైకొను వాఁడు;
అజ్ఞానమున జ్ఞాన మావృతం బైన
యది, దాన జంతువు లందు మోహంబు. ౧౫
అడఁగు నాత్మజ్ఞానమందు నెవ్వారిది

రైన యా యజ్ఞాన, మా పరంబైన
వారి జ్ఞానము సూర్య పగిది వెల్గించు ౧౬
ఆ యాత్మ నా నిష్ఠ నా పరాయణత
నా బుద్ధినియును గలారు జ్ఞానమునఁ
బాపంబు చెదరిన వార లై తిరిగి
రా నట్టి పదమును బ్రాపించు వారు. ౧౭
విద్యావినయమునందు విప్రునం దైనఁ
గుంజరం బందైన గోవునం దైనఁ
శ్వానమం దైన శ్వపాకునం దైన
సమదర్శనంబుతో జ్ఞాను లుండెదరు. ౧౮
మనసు నెవ్వరిది సామ్యంబున నుండు
నిటనె సర్గము వార్ జయించిన వారు,
బ్రహ్మ మాఁ గద దోషరహితంబు సమము,
బ్రహ్మమం దుందురు వారు కాఁబట్టి. ౧౯
పల్లటిల్లని బుద్ధి వాఁడు, మౌఢ్యంబు
నందనివాఁడు, బ్రహ్మంబున నుండు
నటువంటివాఁడు; బ్రహ్మవిదుఁడు, చనదు
ప్రియమైనఁ బొంగ నప్రియమైనఁ గుంద ౨౦
వెలిసోఁకులన్నది పెనఁగనీకుండ
నాత్మలోఁ గలసుఖ మానెడు నట్టి
యల బ్రహ్మయోగ యుక్తాత్ముండు, చేటు
కల్గని సుఖమును గాంచెడి వాఁడు. ౨౧

స్పర్శలం గల్గెడు సుఖము లెవ్వియొ
దుఃఖహేతువులె యవ్వి, దుదమొదల్ గలవి,
వానిలోనను సుఖింపఁడు జ్ఞాని పార్థ. ౨౨
క్రోధకామముల నా క్షోభమిచ్చుటనె
ఓర్వఁ గలం డెవ్వఁ డొడ లూడక మును,
నాతండు యుక్తుండు నా నరుండు సుఖి ౨౩
తనయందె విహరించుఁ దనయందు నెవఁడు
నందెడు సౌఖ్యంబు న ట్లేఁడు వెలుఁగు
వహియించుఁ దనయందె, బ్రహ్మభూతుఁ డయి
బ్రహ్మనిర్వాణంబుఁ బడయు నా యోగి. ౨౪
అఖిల భూతహితార్థు లకలుషాత్ములును
నద్వైధులు యతాత్ము లా నట్టి ఋషులు
బ్రహ్మనిర్వాణంబుఁ బ్రాపించువారు ౨౫
కామకోపంబులం గడచినయట్టి
* యాత్మజ్ఞులు యతాత్ము లైన యతులకు
బ్రహ్మనిర్వాణంబు వఱలు నెల్లెడల. ౨౬
వెలుపలి స్పర్శల వెలిపుచ్చి, కనుల
బొమ్మల నడుమనె పూనిచి, నాస
నడుమ నాడెడు నపానంబుఁ బ్రాణంబు
రెండింటినిం బొనర్చి సమంబులుగను,
బుద్ధిని నింద్రియంబులను మనస్సు

---

* విదితాత్మనాంపా = విజితాత్మనాం.

స్వాధీనములఁ జేసి, భయము కోపంబు
కామముల్ వీడి, మోక్షముఁ బొందఁ గోరు
ముని యెవ్వఁ డాతండు ముక్తుఁడే యెపుడు. ౨౭,౨౮
యజ్ఞంబుఁ దపమును నానెడు నట్టి
సర్వలోకమహేశు సర్వభూతముల
సుహృదు నన్ను నెఱింగి చేరును శాంతి. ౨౯

ఆఱవ అధ్యాయము.

ఆత్మసంయమయోగము.

శ్రీభగవంతుఁడు వల్కె—

కర్మఫలంబును గమనింపకుండఁ
గర్తవ్యకర్మంబుఁ గావించు నెవఁడు
నాతండె సన్న్యాసి యాతఁడే యోగి,
యగ్నిక్రియాహీనుఁ డౌ వాఁడు కాఁడు ౧
అర్జునా, సన్న్యాస మందురు దేని
నయ్యది యోగంబు నని యెఱుంగునది,
సన్న్యసింపఁ బడని సంకల్పములను
గల యెవ్వఁ డేనియుఁ గాఁడుగా యోగి ౨
యోగంబుఁ బొందఁగా నుత్కంఠ గలుగు
మునికి సాధనము కర్మ మని యనెదరు.

అందు యోగారూఢుఁ డైన యంతటను
శమ మ్మౌను వానికే సాధనం బనుచే ౩
ఎపుడు కర్మములను నింద్రియార్థముల
ననుషంగమును వీడు నప్పుడు కాదె,
యఖిల సంకల్ప సన్న్యాసి యౌ వాని,
ననియెడు వారు యోగారూఢుఁ డంచు. ౪
ఆత్మచేతను దననగును దేల్చుకొనఁ,
దన నడఁచికొనంగఁ దగ, దాత్మయేగద
తనచుట్ట మాత్మయే తన విరోధియును. ౫
తన నెవ్వఁ డాత్మచేతనె గెల్చు నట్టి
వానిది యగునాత్మ బంధు వాతనికిఁ,
దనయందు గెల్పు నందనివాని యెడనొ
వైరంబు కావించు వైరి య ట్లాత్మ. ౬
హెచ్చులొచ్చుల నల్ల యెగ్గులగ్గులను
జలివేడుముల నాత్మ సాధించునట్టి
బహుశాంతునకు నొందఁబడుఁ బరమాత్మ. ౭
జ్ఞానంబుచేత విజ్ఞానంబుచేత
* నాదట చెందిన యాత్మఁ గలాఁడు,
నిశ్చలుండు విజితేంద్రియుఁడును నైన
పొన్ను ఱా మన్నొక్కపోలికఁ జూచు,
యోగిని నందురు యుక్తుండు నాఁగ. ౮

---

* ఆదట=తృప్తి.

అరిసుహృన్మిత్ర మధ్యస్థబంధువుల
యందు నుదాసీనులందు సాధువుల
యందు ద్వేష్యులఁ బాపులందు సమమగు
బుద్ధిని గలవాఁ డవును విశిష్టుండు. ౯
కోరకయును గయికొనకయు యోగి
చిత్తాత్మలను లోను జేసి యేకాకి
యై రహస్యం బైన యట్టిచో నుండి
సతతము నాత్మ నిశ్చలముసేయ నగు ౧౦
కడు నెత్తు కడ లోఁతు కాని మడుఁ *గెడఁ
గుశలపై నజినంబుఁ గోక నాపైనఁ
గల యాసనంబును గట్టిఁగాఁ దనకు
స్థాపించి దానిమీఁదను గూరుచుండి,
యమరించి మనసు నేకాగ్రంబుఁగాను
జిత్తేంద్రియంబులఁ జేష్టలఁ గట్టి,
యాత్మశుద్ధికి యోగ మాచరింపనగు ౧౧, ౧
మేనును దలయును మెడయుఁ జెక్కంగఁ
గదలకుండ స్థిరముగాఁగ ధరించి,
దిక్కులం జూడక దృష్టిని దనదు
కొన ముక్కునను బాదు కొల్పి, మనంబు
నాఁపి, ప్రశాంతాత్ముఁ డగుచు, భయంబు
నడఁగించి, బ్రహ్మచర్యవ్రత మూని,

* ఎడ=చోటు

చిత్తంబు నాపైనఁ జేరిచి, నన్నె
భావించుచును, యోగివలయుఁ గూర్చుండ. ౧౩, ౧౪
నియతమానసుఁడై యనిశమును యోగి
యాత్మ నిట్లూఁపి, నాయందలి దైన
నిర్వాణ పరమశాన్తిఁ బడయుఁవాఁడు. ౧౫
ఎక్కువ దినువాని కేమియుఁ దినని
వానికిఁ, గడుఁగూర్కు వానికిఁ గూర్కు
లేనివానికిఁ బార్థ లేదు యోగంబు. ౧౬
పాటిగా విహరింపుఁ, బాటిగాఁ గుడుచు,
మెలఁకువ కూర్కులఁ మితముగాఁ గలుగు,
మితముగాఁ బనులందు మెలఁగు, నాతనికి
వొరకొను, దుఃఖముల్ దొలఁచు యోగంబు ౧౭
నియతమై చిత్తంబు నిల్చునో యాత్మ
యందె యెప్పుడు, కోర్కెలన్నింటనుస్పృహ
నుడిపి, యనఁబడు యుక్తుండు నాఁగ. ౧౮
గాలి గొట్టని చోటఁ గలుగు దీపంబు
చలియింప కుండునే పొడ్పున నదియు
నాత్మయోగంబు నభ్యాసంబు చేయు
యతచిత్తుఁ డగు యోగి కగు నుపమంబు. ౧౯
ఎట యోగసేవ వారింపఁ బడుమది
యుపరతిఁ గను, నెట నుండియు నాత్మ
నాత్మచేఁ గని యాత్మయందె తుష్టిగొను,

నింద్రియంబుల మీఱి యెఱుఁగ బుద్ధికగు
నాయనంతసుఖంబు నాతఁ డెం దెఱుఁగు,
నెందుండి తత్త్వమం దేమి తొలఁగఁడొ,
* తనికిన దేనిని దానికన్న మఱి
యితర మే లాభంబు నెక్కుడు గాను
భావింపఁ, డెందుండి ప్రబలదుఃఖముల
వలననేఁ గదలండొ, పాటింపుదాని
వంతల కలయిక పాపు యోగమని;
అట్టి యోగంబును, నాస్థమై వ్యథను
జెందని మనసుతోఁ, జెల్లునుగూర్ప. ౨౦,౨౩
సంకల్పభవము లౌ సర్వకామముల
నడుగంట విడనాడి, యన్నింటఁ జెక్క
నిల్పి యింద్రియము లన్నిమనస్సుచేన,
ధృతి గొన్నబుద్ధిచేఁ దిరముగా మనసు
నాత్మయం దమరించి, యల్లన నొను
నుపరతిఁగనఁ! జెన దొండేమి తలఁప. ౨౪,౨౫
స్థైర్యంబు లేక చంచలమగు మనసు
నెందెందుఁ జెనుదాని నీడ్చి యందుండి,
యాత్మయందే వశం బగును జేయంగ. ౨౬
శాంతమనస్వియు శాంతిని గొన్న
రాజసగుణుఁడును బ్రహ్మభూతుండు

---

* తనుకు=కలుగు.

నపగతకిల్బిషుం డైన యీ యోగి
శ్రేష్ఠ మైనసుఖంబు చేరును గాదె. ౨౭

ఇవ్విధంబుగ నాత్మ నెప్పుడు నిల్పి,
సుఖముగా గతకల్మషుం డైన యోగి
కొనలేని బ్రహ్మసోఁకు సుకము నొందు. ౨౮

ఎల్లెడ సమముగా నీక్షించు నట్టి
యోగ యుక్తాత్ముండు యోజించు నాత్మ
నన్ని భూతమ్ముల నమరు దానిగను,
నాత్మలో భూతంబు లన్ని యున్నవిగ. ౨౯

ఎవ్వండు నన్నింట నీక్షించు నన్ను
నన్నింటిఁ గాంచు నాయందును మఱియు,
వానికి నే లేని వాఁడను గాను
వాఁడు నాకును లేనివాఁడుగా కుండు. 30

అఖిలభూతంబుల యందుండు నన్ను
నేకత్వ మొంది భజించు నెవ్వండు
వాఁ డన్ని విధముల వర్తించుచుండు
నేని నా యందె వర్తించు నా యోగి. 3౧

సుఖమైన దుఃఖంబు చొప్పడెనేని
తనఁబోలె నన్నింట దరిసించు నొకటి
గా, నెవ్వఁ డా యోగి ఘనుఁ డండ్రుపార్థ. 3౨

అర్జునుఁడు పల్కె.

“సామ్యంబు నను జేసి సమకురు నట్లు;
నో కృష్ణ పల్కితే యోగంబు నీవు,
చంచలతను దీని స్థైర్యంబుఁ గాంచ. ౩౩
చంచలము, బలము చేలము గలదియుఁ,
గలఁచునది, మనసు గదకృష్ణ, దాని
గట్టుట గాలిని గట్టుట వోలె
దుష్కరంబు గడునాఁ దోఁచెడు నాకు” ౩౪

శ్రీ భగవంతుఁడు పల్కె.

“నిక్కంబు మనసు దుర్నిగ్రహంబు మఱి
చంచలం, బయ్యు విజయ నిల్పనగును,
వైరాగ్యమునను నభ్యాసంబున జయ. ౩౫
అవునా మత మనస్యతాత్మునకొందఁ
గా నసాధ్యంబు యోగంబని, మనసు
స్వాధీనమయినట్టి యత్నంబు గల్గు
వానికిఁ బడయ నుపాయంబున నగు.” ౩౬

అర్జునుఁడు పల్కె.

“కలిగియు శ్రద్ధను గడక లేనట్టి
యోగంబు నందుండి యుర్లిన మనసు
నున్నట్టి యాతండు యోగసంసిద్ధి
పొందక యే గతిఁ బోయెడుఁ గృష్ణ. ౩౭

భ్రష్టుఁడై రెంటికి, బ్రహ్మమార్గమున
మూఢుఁడై, యాధారమును లేనివాఁడు
నయి, భిన్నమేఘమ ట్లణఁగఁడే దేవ ౩౮
ఈ నాదు శంక నో కృష్ణ, పూర్ణముగఁ
దొలఁగింపఁ దగు దీవు, దొరకఁడు గాదె
యీ శంకఁ బాపువాఁ డింక నీ కన్న" ౩౯

శ్రీభగవంతుఁడు పల్కె.

"అతనికి నిందేని యందేని పార్థ
నాశంబు కలుగదు; నాయనా మంచి
చేయువాఁ డెవఁడేని చెడిపోఁడు గాదె. ౪౦
యోగంబు నందుండి యురిలినవాఁడు
పుణ్యలోకంబులఁ బొంది పెక్కేండ్లు
నటనుండి శ్రీమంతు లౌ శుచులు నగు
వారల యింటను బ్రభవింపఁ గలఁడు ౪౧
కాదేని జ్ఞానంబు కల యోగుల దగు
వంశంబుననె పుట్టు; బహుదుర్లభంబు
ఇద జన్మమెట్టి లోకమున నిట్టి దది ౪౨
పూర్వదేహమున నా బుద్ధియోగ మటఁ
బొందును, యత్నంబు పొనరించు నంత
సంసిద్ధి కొఱకు విజయుఁడ వెండియును ౪౩
మొదలింటి యభ్యాసమున దాని చేన
యవశుఁడై యును నతం డాకృష్టుఁ డగును,

యోగ మెఱుఁగు కోర్కె యున్నమాత్రమున
నతఁడు శబ్దబ్రహ్మ *మతకరించెడిని. ౪౪
జేతనంబు కడఁకతోఁ జెలుపువాఁ డగుచు
హృతకిల్బిషుఁ డయి యనేకజన్మములఁ
బ్రాప్తసంసిద్ధుఁ డౌ వాఁ డయి యంతఁ
బరమ మౌ పదమును బ్రాపించు యోగి ౪౫
† నేటు తాపసులకంటెను యోగి మఱియు
జ్ఞానుల కన్నను ఘనుఁ డని యెంతు,
కర్ముల కన్నను ఘనుఁ డగు యోగి;
కావున యోగివి కమ్ము కౌంతేయ ౪౬
శ్రద్ధమై, నా యందు స్థాపించి మనసు
భజియించు నెవఁడు నన్ వాని దలంతు
యోగు లందఱన్నైత ముత్తముఁ డంచు" ౪౭

ఏడవ అధ్యాయము.

విజ్ఞానయోగము.

శ్రీ భగవంతుఁడు పల్కె.

నాయందు మనసూని నన్ను బ్రాపుగోని
చలుపుచు యోగమే చేడ్పున నన్ను

* అతకరించు = అతిక్రమించు. † నేటు = శ్రేష్టము.

సంపూర్ణముగను నిస్సందేహముగను
దెలియఁగాఁ గలవో కౌంతేయ దాని విను. ౧
ఎద్దాని నెఱిఁగిన నిటమఱి యెఱుఁగ
నగున దొండొకటి లేదగు నట్టిది యిదె
జ్ఞానంబును సహావిజ్ఞానంబు గాఁగఁ
గడమ లేకుండఁ నేఁ గఱపెద నీకు. ౨
నరుల వేలకొలంది నడుమ నెవ్వండొ
యొకరుండు సిద్ధికై యుంకించు, నట్టి
యుంకించు సిద్ధులం దొకఁడెవ్వండొ
యొల్లెది యున్నదట్లెఱుఁగును నన్ను ౩
అనిలంబు భూమియు ననలంబు జలము
నాకసము మన సహంకృతి బుద్ధి
యనఁగ నాదు ప్రకృతి యయినది యిద్ది
భిన్నమౌ నెనిమిది విధములుగాను. ౪
ఇయ్యది యపరంబు నింతకన్న మఱి
యితరంబు దేనిచే నిజ్జగంబు, నర,
మోవఁగాఁ బడు, జీవభూత మౌ నట్టి
నా ప్రకృతిఁ బరము నా నెఱుంగునది. ౫
సర్వభూతంబులు జన్మించు నిందు
నని యెఱుంగుము మఱి యఖిలమౌ జగముఁ
బుట్టించు వాఁడనేఁ బొలియించు వాఁడ ౬
నాకన్నఁ బరమున్నదది యొండు లేదు

దారాన మణుల వితతియట్లుఁ బార్థ
యంత యున్నదిది నాయందుఁ గూర్పఁబడి ౭
చంద్రార్కులను గాంతి, చేవినీట, నరుల
యందుఁ బౌరుష మేను, నఖిలవేదముల
నోంకారమును, శబ్ద ముప్పరవీధి,
భువి సుగంధంబు, నిప్పునవెల్గునౌదు,
నఖిలభూతంబుల నౌదు జీవనము,
నర, యౌదును దపోజనంబులఁ దపము. ౮, ౯
అఖిలభూతంబుల కాదిబీజంబు
నగుదును నని నన్ను నర్జునా యెఱుఁగు
బుద్ధిమంతులయొక్క బుద్ధి నే నౌదుఁ
దేజస్వు లగువారి తేజంబు నేను ౧౦
పార్థ యౌదును బలవంతుల యొక్క
కామంబు రాగంబు గలియని బలము,
భూతంబులను ధర్మమున కెడగాని
యట్టి కామంబును నగుదును నేను. ౧౧
సాత్వికము లెవి రాజసపు భావములు
నేవి తామసములు నెయ్యవి యగునొ
నావలనివె యవి నాఁగ నెఱుంగు,
ఉండు నాలో నవి యుండనే నందు ౧౨
మూడు గొనంబుల పొందైన వైన
యీ భావములచేత నీ జగం బెల్ల

యగు మోహితము, వీనికన్నను బరము
నైనట్టి యవ్యయుం బగు నన్నెఱుఁగదు. ౧౩
దైవియై నది గుణాత్మకమును నైన
యీ నాదు మాయను నీఁదఁ గాదు గద,
యెవరు పొందెదరు నన్ను శరణు వారు
పోలుదు రీ మాయ సంతరింపంగ. ౧౪
మాయచే జ్ఞానంబు మాసిన వారు
దుష్కృతుల్ మూఢు లా తుచ్ఛులు నన్ను
భజియింపరాసుర భావంబు నాని. ౧౫
ఆర్తుండు జిజ్ఞాసు వర్థార్థి జ్ఞాని
యనఁగఁ బార్థ సుకృతులైన నల్వురుఁగలు
నన్ను. జనుల్ భజియింతు రర్జునా, నన్ను. ౧౬
ఈ నలువురిలోన నేకభక్తుండు
నిత్యయుక్తుఁ డగు జ్ఞాని విశిష్టుఁ డగును;
అట్టి జ్ఞానికి నేను నత్యంతముగను
బ్రియుఁడ, వాఁడును నాకుఁ బ్రియుఁడును గాదె. ౧౭
ఎల్లవారు నుదారులే వీరు, నైన,
జ్ఞాని యాత్మయే నా నాడు మతము,
యుక్తాత్ముఁ డై వాఁడు సర్వకుని నన్ను
యుత్కృష్ట గతినిఁ గా నొందెడు గాదె. ౧౮
పెక్కులౌ జన్మముల వెనుక జ్ఞాని యయి
వాసుదేవుండె సర్వంబు నా నన్ను

గొలుచు, నరిది కలుగుట యట్టిఘనుఁడు. ౧౯
తమ తమ ప్రకృతిచేత నియమింపఁబడి
అల కోర్కులను జ్ఞాన మడఁగిన వారు
నయి యయ్యయి నియతు లాని యితరులు
నగునట్టి వేల్పుల నాశ్రయించెదరు. ౨౦
ఎవ్వఁ డెవ్వఁడు నే యే రూపమునను
భక్తుఁడై శ్రద్ధమై భజియింపఁ గోరు
నతని యా శ్రద్ధనే యచలంబు సేతు. ౨౧
అలశ్రద్ధతో వాఁడు నంటిన వాఁడు
నై కోరు వారినే యర్చింపఁ గాను,
నాచేతనే వినిర్ణయము లైన యల
కోరికల్ వారిచేఁ గొనియెడుఁ గాదె. ౨౨
దేవులం గొల్చువార్ దేవులం గంద్రు,
స్వల్పంబు నగునట్టి జ్ఞానంబు గలుగు
వారి యాఫలము నశ్వరము నైన దగు,
నన్ను గొల్చెడి వారు నన్నె పొందెదరు. ౨౩
మేలైన తలుఁగని మేటిలేనట్టి
నా తీ రెఱుఁగని యజ్ఞానులు నన్ను
నవ్యక్తు, వ్యక్తిఁ గొన్నట్టు లెంచెదరు. ౨౪
ఎల్లవారల కేను నెఱుఁగఁగా రాను,
అగుటచే యోగమా యాసమావృతుఁడ,
నన్ను వివేకశూన్య మగు నీ జగము

నజునిగాను నెఱుఁగ దవ్యయునిగను. ౨౫
కడచిన వున్నవి కాఁగలవైన
భూతంబు లెఱుక యవును బార్థ, నాకు
ఎఱుఁగఁడు న న్నెవ్వఁ డేనియుఁ గాని. ౨౬
ద్వేషేచ్ఛలను గల్గు ద్వితయమోహమున
జయ, సర్వభూతముల్ జననకాలంబు
నందు సమ్మోహంబు నందెదు విజయ. ౨౭
పుణ్యకర్ములగు నే పురుషులకు యగు
పాపంబు తుదఁగాను, ద్వంద్వముక్తు లయి
భజియింత్రు వారు దృఢవ్రతు లయి నన్ను. ౨౮
ముదిమిని జావును బోఁగొట్టుకొనఁగ
నను జేరి యెవరు మొనయుదురు వారు
నధ్యాత్మమంతయు నఖిలకర్మమును
గ్రహియింత్రు వారల్ల బ్రహ్మంబుఁ గూడ. ౨౯
అధిభూత మధిదైవ మధియజ్ఞములను
గూడిన య ట్లెఱుంగుదురు న న్నెవరు
యతమనస్కు లయి వా రంతకాలమునను
గూడను నుందురు గుఱుతెఱింగి నను. 30

ఎనిమిదవ అధ్యాయము.

అక్షరపరబ్రహ్మయోగము.

అర్జునుఁడు పల్కె.

ఆ బ్రహ్మమేది యధ్యాత్మ మెట్టియది
ఎది కర్మ మధిభూత మెయ్యది యంద్రు
అధిదైవ మెయ్యది యందురు కృష్ణ, ౧
ఎవఁ డెట్టు లధియజ్ఞుఁ డీ దేహమందు,
నం దెట్లు హరి నియతాత్ములచేత
నేగు కాలమునను నెఱుఁగ నయ్యెదవు ౨

శ్రీ భగవంతుఁడు పల్కె.

ఓ బ్రహ్మము పరమ మా నక్షరంబు,
అధ్యాత్మ మనఁబడు నది స్వభావంబు,
భూతభావంబులఁ బొడమించు నద్ది
యగు విసర్గముకర్మ మనఁగను బరఁగు ౩
అధిభూత మన నర యంతవంత మగు
నట్టిది, పురుషుండు నధి దైవతుండు
నధియజ్ఞుఁ డీ దేహమందు నేనె యగు ౪
చచ్చునప్పుడు నన్నె స్మరియించు చెవఁడు
నేగు దేహంబు త్యజించి వాఁ డొందు
నా భావము ననుమానంబు లే దిందు ౫

ఏదేది భావంబు నెంచుచుఁ, దుదను
సంగంబు విడు, నెప్పుడల్ల భావంబె
కలుగంగ, దానినే కాంచును పార్థ ౬
సతతంబు కావున స్మరియింపు నన్ను
పోరును జేలుపుము బుద్ధియు మనము
నాయందుఁ బాదుకొన్న యతండవు నయి
నిక్కంబుగా నన్నె నీవు పొందెదవు ౭
అభ్యాసయోగంబు నానిన దొండుఁ
జేరని చిత్తంబుచేఁ దలంచుచును
బరమపురుషు దివ్యుఁ బ్రాపించుఁ బార్థ ౮
భక్తియుక్తుఁ డయి యెవ్వండు, కడచేను
కాలంబునందు యోగబలంబుచేన
తొలఁగనట్టి మనస్సుతోఁ జెక్క నసువు
భ్రూమధ్యమున నిల్పి పూర్వుఁడు కవియు
నఖిల నిర్మాతయు నణువులలోన
నణువును నిర్ణేత యగు తలంపంగ
రానిరూపను వాని రవివన్నె వాని
ధ్వాంతంబు దాఁటిన పరమ పూరుషుని,
భావించు నాతండు పడయు నా దివ్య. ౯, ౧౦
అంద్రు వేదజ్ఞులే దక్షరం బనుచు,
నేదాని రాగరహితులైన యతులు

*కూర్కొందు, రెద్దాని గోరిన వారు
బ్రహ్మచర్యంబున వర్తింతు, రట్టి
పదము సంగ్రహముగా వచియింతు నీకు. ౧౧
ద్వారంబు లన్నింటి బంధించి లెస్స
మ దెద నిడి తలకుం దనదు ప్రాణంబు
రప్పించి యోగధారణమును బొంది ౧౨
ఓ మ్మను బ్రహ్మమౌ నొక్క యక్షరము
నుడువుచును స్మరియించుచు నన్ను, నొడలు
†నెడయుచు నెవఁడు పోయెడు, నట్టి వాఁడు
పరమ మైన గతిని బ్రాపింపఁ గలఁడు. ౧౩
ఇతరంబుపై మనం బేగని వాఁడు
నై నిత్యయుక్తుండు నై యనుదినము
నెవఁడు నన్ స్మరియించు నెప్పుడు పార్థ
అట్టి యోగికి నేను నౌదు సులభుఁడ. ౧౪
పరమమౌ సంసిద్ధిఁ బడసిన యట్టి
వారౌ మహాత్ములు ప్రాపించి నన్ను,
నస్థిరమైన దుఃఖాలయ మైన
యట్టి జన్మంబును నందరు తిరిగి. ౧౫
కౌంతేయ బ్రహ్మలోకంబుతోఁ గూడ
నిఖిలలోకంబులు ద్దిరిగి వచ్చునవె,
నర, లేదు నను బొందినన్ బునర్భవము. ౧౬

* కూర్కొందురు=ప్రవేశింతురు. † ఎడయు=ఉజ్జగించు.

పగలు రే లెఱిఁగిన వారు, బ్రహ్మ దగు
పవలెద్ది యయ్యది పదినూర్ యుగములు
గలదని, రాత్రి యుగములు వేయింటిఁ
గలయట్టి దనియును గనుగొనియెదరు. ౧౭
పగలు రాఁ గలుగు నవ్యక్తంబువలన
వ్యక్తముల్ సర్వముల్, వచ్చుడు రాత్రి
యుడఁగు నా యవ్యక్త మను దానియందె. ౧౮
విజయ, యా యీ భూతవితతె యవశము
గాఁ బుట్టి పుట్టియుఁ గడచేను చెందు
రాత్రి రాఁ, బగలు రాఁ బ్రభవంబు నొందు. ౧౯
అల్ల యవ్యక్తంబు కన్న నన్యంబు
నైన యవ్యక్తంబు నాది లేనిదియు
నగు భావ మే దది, యఖిలభూతములు
నశియించుచుండంగ నశియించి పోదు. ౨౦
అక్షరం బవ్యక్త మనఁగను బరఁగుఁ,
బరమ మా గతి యని వచియింత్రు దాని,
దేనిని బొందినఁ దిరిగి రా, రట్టి
పరమ మా నట్టి యా పదమగు నాది. ౨౧
ఎవనిలో భూతంబు లిరవొంది యుండు,
నెవనిచే వ్యాప్తమా నియ్యది యంత,
ఆ పరమపురుషుఁ డన్యముండనిది
యా భక్తిచేఁ బార్థ, యాను లభ్యుండు. ౨౨

ఏకాలమున యోగు లేగినఁ దిరిగి
వచ్చెద రెపుడు పోవ మరల రా రొ,
యట్టి కాలంబు నో యర్జునా, వినుతు. ౨౩

అగ్నియు జ్యోతి యహస్సు శుద్ధంబు
నారు మాసము లుత్తరాయణం బందుఁ
బ్రాణంబు విడిచెడి బ్రహ్మజ్ఞు లైన
వారలు బ్రహ్మంబుఁ బ్రాపింపఁ గలరు. ౨౪

తుది యర్ధమాసంబుఁ ధూమంబు రాత్రి
యందును దక్షిణాయన మారునెలల
యోగి యిందు జ్యోతి నొంది వచ్చెడిని. ౨౫

సిత మసితము లివి స్థిరమైన రెండు
గతులు జగమునకుఁ గదయంచు నెంతు,
నొకట ననావృత్తి నొందు నన్యంబు
వలన నేతెంచుట వాటిల్లుఁ దిరిగి ౨౬

ఈ రెండుమార్గంబు లెఱిఁగిన యోగి
యెవ్వఁ డేనియు మోహ మెనయండుపార్థ,
కావునను సకల కాలంబులందుఁ
గుంతీజ యోగయుక్తుండవు కమ్ము. ౨౭

ఏ పుణ్యఫలము వచింపఁగాఁ బడియె
యజ్ఞంబులఁ దపములందు వేదముల
నీవు లందును గూడ, నియ్యదెతెంగి,

దానినినంతయు దాఁటును యోగి
యాద్యంబు పరమంబు నగుస్థాన మొందు. ౨౮

తొమ్మిదవ అధ్యాయము.

రాజవిద్యా రాజగుహ్యయోగము.

శ్రీ భగవంతుఁడు పల్కె.

అశుభంబువలన నెయ్యెడ దెలుంగ, విడువఁ
బడుదు వట్టిదియును బహురహస్య మిదె
జ్ఞానంబు విజ్ఞానసహిత మా దాని
నుగ్గడింతు నసూయ నొందని నీకు ౧
రాజవిద్యయు నిద్ది రాజగుహ్యంబు
ధర్మ్య ముత్తమము ప్రత్యక్షావగమము
శుద్ధ మవ్యయము సుసుఖ మాచరింప ౨
ఈ ధర్మమున శ్రద్ధ యొనయని నరులు
మరణయుక్త మగు సంసారమార్గమున
మగుడి వత్తురు నను బ్రాపింపక నర 3
అఖిల మా నీజగం బవ్యక్తమూర్తి
యయిన నాచేఁ దతంబగునుగా, యందు
నిఖిలభూతము లుండు నేవాని యందుఁ
గా నున్నవానిని, గావు భూతములు

నాయందు నున్నవి; నాదు మేటిదగు
కూరుపునుం గనుఁగొను, భూతములను
బోడమించు నా యాత్మ భూతము లందు
నిరవొందదు మఱి భరించు భూతముల ౪, ౫
అంతటఁ జరియించు నది విపులంబు
నగు వాయు వాకాశమం దెప్పు డుండు
నట్లు నాయం దుండు నన్ని భూతములు
నా నెఱుంగుము పార్థ, నాదు ప్రకృతిని
భూతంబు లన్నియుఁ బొందుఁ బ్రళయము
కాలమందును, సృష్టి కాలంబునందుఁ
గ్రమ్మఱ వానిని గలిగింతు నేను ౬,౭
అస్వతంత్ర మగు నీ యఖిలభూతముల
ప్రతతిఁ బోరింబోరిఁ బ్రకృతివశముగఁ
బుట్టించెదను నేను బూని నా ప్రకృతి. ౮
ఆసక్తి కల్గక యాకర్మములను
దగులము లేని యాతని యట్టు లుండు
నన్ను నా కర్మముల్ నర, కట్టఁ గావు ౯
అర్జునా యధ్యక్షుఁ డైన నాచేతఁ
బ్రకృతి చరము నచరంబును గాంచు.
వర్తించు జగము బల్ వగల నీ కతన ౧౦
భూతమహేశ్వరంబు నయిన నాదు
పరమభావంబు నేర్వని మూఢ జనులు
వపువు దాల్చిన నన్ను వజ్ఞ సల్పెదరు. ౧౧

రిత్తకోర్కులవారు రిత్తచెయ్దముల
వారు రిత్తతెలివి వారు పాలసులు
రాక్షసంబును నాసురంబు మోహంబు
నందించే ప్రకృతినే యాశ్రయించెదరు. ౧౨
దివ్యమౌ ప్రకృతిఁ బొందినయట్టి వారు
నౌ ఘనులౌ నను భూతాదిముఁ గొల్త్రు,
ఎద నన్నె మెన్నక, యెఱిఁగి యవ్యయుఁగ ౧౩
యతమానులు నను నిత్యంబును గీర్తి
పచేరించే వార్ స్థిరవ్రతులును భక్తి
నెపుడు యుక్తులును నయినవారు నన్నుఁ
బ్రణమిల్లువారునై భజియించే వారు. ౧౪
విశ్వరూపుఁడగు నన్వేఱొందు వారు
జ్ఞానయజ్ఞమున బూజనము సేయుచును
వేఱువేఱనియును బెక్కండ్రు ననియు
నొక్కండె యనియును నొనరింత్రు సేవ. ౧౫
ఏ యజ్ఞమేఁ గ్రతువే స్వధ నేనె
యాజ్య మేనే యగ్ని నౌషధం బేనె
యేనె హుతంబును నేనె మంత్రంబు ౧౬
ఏను దండ్రియుఁ దల్లి నీ జగంబునకుఁ
దాతయు ధాతవేద్యంబుఁ బావనము
మఱియును ఋక్కనుం బ్రణవమ్ముఁ గూడ
సామంబును యజుస్సు సాక్షియు గతియు

భర్త నివాసంబుఁ బ్రభువు సుహృత్తు
శరణంబుఁ బ్రభవంబు స్థానంబు లయమ్ము
సమిసి పోనట్టి బీజము నిధానంబు. ౧౭, ౧౮.
నే నెండఁ జేయుదు, నేను వర్షంబుఁ
గురిపింతు నిలుపుదుఁ గూడ నేఁ బార్థ
సత్తు నసత్తును జావు నమృతము. ౧౯
యజ్ఞంబులను నన్ను నర్చించి యాని
సోమపానంబులను జ్యూతపాపులు తిగ
ప్రాఁజదువుల వారు స్వర్గలోకమును
బొందఁ గోరెదరు, వార్ పుణ్య మా నట్టి
స్వర్లోకమును బొంది స్వర్గంబు నందుఁ
దినెదరు దివ్య మా దేవభోగముల. ౨౦
వారా విశాల మా స్వర్గలోకంబు
ననుభవించియుఁ బుణ్య మంత మందంగఁ
బొందెదర్ నరలోకముఁ, దొలిపలుకుల
*పాటి నానెడు వారు వలపుల వలపుఁ
గలవారు రాకపోకలఁ గందురిట్లు. ౨౧
ఎవరు వే ఱొండుఁ జింతింపక నన్ను
నారఁ గొల్తురల నిత్యాభియుక్తులవి
యోగంబు క్షేమంబు నూనుదు నేను. ౨౨
ఇతర దేవతలందు నెవ్వారు భక్తిఁ

* పాటి=ప్రమాణము.

గూడియు శ్రద్ధతోఁ గొలిచెద రట్టి
వారును నవిధిపూర్వకముగ నన్నె
కొలుచు వారౌదురు కుంతీతనూజ. ౨౩

అఖిలయజ్ఞంబుల కగుదుఁగా నేనె
ప్రభుఁడ భోక్తయును, దత్వంబుగా నన్ను
వా రెఱుఁగరు, గానఁ బడియెదరు గా దె. ౨౪

వేల్పులం గొల్చువార్ వేల్పులం గంద్రు,
పితరులం గొల్చువార్ పితరులం గంద్రు,
భూతముల్ గొల్చువార్ భూతముల్ గంద్రు,
నను గొల్చువారును నన్నె కాంచెదరు. ౨౫

పత్రంబొ పుష్పంబొ ఫలమొ తోయంబొ
యెవ్వండు భక్తితో నిచ్చును నాకు
నట్టి శుద్ధాత్ముండు నర్మిలితోడ
నర్పించు దాని నే ననుభవించెదను. ౨౬

ఎయ్యది యొనరింతు, వెద్ది కుడుతువొ,
హోమ మెయ్యది సేతువో, యొసంగెదవొ
యెయ్యది, సల్పెదవే తపం, బద్ది
యర్జునా సల్పు నా కర్పణంబుగను. ౨౭

కష్టసుఖంబులఁ గలిగించు నట్టి
కర్మబంధంబులఁ గడచెద విట్లు,
సన్న్యాసయోగ మెసంగిన యాత్మ
ముక్తుండ వై నన్నుఁ బొందెద వీవు ౨౮

అఖిలభూతంబులయందు నే సముఁడ,
లేఁడు నాకుఁ బ్రియుండు లేఁడు, ద్వేష్యుండు,
భక్తితో నెవరు న న్భజియింత్రు వారి
యం దేను నుందు నాయందుఁ వా రుండ్రు. ౨౯
అధికదురాచారుఁ డగునేనియు ననుఁ
గొలుచునే నన్యంబుఁ గొలువక, వాఁడు
లెస్సగా మనసు నిల్పినవాఁడు గాదె,
వాని శ్రేష్ఠుఁడె యని భావింపఁ దగును. 30
అతఁడు వే ధర్మాత్ముఁ డగు, స్థిర మైన
యట్టి శాంతిని బొందు, నర్జునా నాదు
భక్తుండు చెడఁడని పంతంబు సల్పు. 3౧
పాపజన్ములును స్త్రీ వైశ్యశూద్రులును
నగు వారు గూడ న న్నాశ్రయించి నర,
పరమ మౌ పదమును బ్రాపింతురు గద. 3౨
భక్తులుం బుణ్యు లౌ బ్రాహ్మణులు మఱి
రాజర్షు లైనవారల నేమి చెప్ప
నసుఖంబును ననిత్య మగు నీ జగంబుఁ
బొంది సేవను బొనర్పుము నీవు నన్ను 33
నను దలంపుము కమ్ము నాదు భక్తుఁడవు
నను గొల్వు మెఱఁగుము నాకు; మత్పరుఁడు
నగుచు యుక్తుండవు నయి యిట్లు నీవు
నాత్మ యౌనట్టి న న్నందఁగాఁ గలవు 3౪

పదియవ అధ్యాయము

అక్షరపరబ్రహ్మయోగము

హార్దింపు నీకు హితార్థంబు విజయ,
మరల నేఁ జెప్పు మేల్మాటను వినుము ౧
సురగణంబులు మహర్షులు నా ప్రభవము
నెఱుఁగరు సురలకు నే మహర్షులకు
నఖిలవిధంబుల నాదిని గాదె. ౨
ఎవఁడు నన్ను లోకమహేశ్వరుని నజుఁ
గను నాదిరహితునిగ నెఱుంగు నతఁడు
నగు నమూఢుఁడు నరులందును లెస్స,
పాయును సర్వపాపంబుల నుండి. ౩
జ్ఞానంబు బుద్ధి యసమ్మోహము మఱి
సత్యంబు దమమును శమమును క్షమయు
భవమును నభవంబు భయ మభయంబు
దుఃఖంబు సుఖమును దుష్టియుఁ దపము
సమత యహింస యశము నయశంబు
దానంబు ననెడి భూతముల భావములు
పొడమెడుఁ బలువితంబుల నావలననె. ౪, ౫
ఈ ప్రజల్ జగమున నెవ్వారివలన,
మునుపు పుట్టిరల యేడ్వురు మహర్షులును
నల్వురు మనువుల్, మనసునఁ గలిగిరి,

నాదు భావంబునుం గలిగిన వారు. ౬
ఈ యోగమైశ్వర్య మెవఁడు నాయవ్వి
తత్వంబుగఁ గను నాతండు కాఁ గలఁడు
తొలఁగని యోగంబుతో నున్న వాఁడు,
సందేహ మిందుకుఁ జాలదు కలుగ. ౭
అఖిలంబుఁ బుట్టించు నాతండు నేను,
నావలనను నంత నడుచుచు నుండు,
నిట్లు తలఁచి భజియింతురు నన్ను
భావంబుతో గూడు వారలౌ బుధులు. ౮
చిత్తంబు నాపైనఁ జేర్చినవారు
ప్రాణముల్ నాయందు వఱలెడువారు,
నొండొరుల్ బోధన మొనరించు కొనుచు,
నాకథనంబులఁ వాకొను చుండ్రు,
ఎపుడు తుష్టులును గ్రీడించు చుండెదరు. ౯
ఎప్పుడు యుక్తు లయి ప్రియముతోడ
భజియించు వారికి వారు దేన నను
నొందుదు రా బుద్ధి యోగంబు నిత్తు ౧౦
దయచేన వారి యాత్మలయందు నిలిచి
యజ్ఞానమునఁ గల్గు నట్టి తమంబు,
భాసించు జ్ఞానదీపముననే నడఁతు ౧౧

అర్జునుఁడు పల్కె.

పరమ మా బ్రహ్మంబు పరమధామంబు

పురుషుండును బరమపూతంబు నీవు
నిత్యుండు ననియును దివ్యుండు ననియు
నాదిదేవుం డని యజుఁ డని విభుఁడు
నని నిన్ను వ్యాసుండు నసితుండు ఋషులు
నందఱు దేవలుం డందురు, నీవు
గూడ నాతోడ వా క్రుచ్చెద వట్లు. ౧౨, ౧౩
ఈవు నాతోఁ బల్కెదెద్దిది యెల్ల
తథ్యం బటంచును దలఁచెదఁ గృష్ణ.
దేవ నీవ్యక్తిని దేవతలేని
యును దానవులు నేనియును గనరు గద. ౧౪
దేవదేవ, జగత్పతి, పురుషోత్తముఁడ,
భూతమహేశ్వర, భూతభావనుఁడ,
స్వయముగా నీ స్వరూప మెఱిఁగె దీవ. ౧౫
నీదు విభూతులు దివ్యంబులు గద,
యే విభూతులచేత నీ లోక మీవు
వ్యాపించి యున్నావొ వానిని గొఱఁత
గలుగక వచియింపఁ గా నర్హుఁ డవుదు. ౧౬
ఎపుడు నిన్నె లెస్స చింతించుచు యోగి,
యే నిన్ను నెఱిఁగెద నెట్లు? స్వామి, నిను
నేఁ దలఁపనగు నే యేభావములను? ౧౭
నీ యోగము విభూతిని విపులంబుగను
వచియింపుము మరల స్వామి, యమృతము

వినునట్టి నాకుఁ దృప్తి కలుగదు గద. ౧౮

శ్రీ భగవంతుఁడు పల్కె.

నే నీకుఁ జెప్పెద న్దివ్యంబు లైన
ముఖ్యంబు లగు నా విభూతుల నింక,
కడ లేదు వివరింపఁ గద పార్థ, నాకు. ౧౯
నిఖిలభూతంబుల నెలకొనియుండు
నాత్మ నేనే యాదు నర్జునా, నేనె
యాదు భూతముల మధ్యాంతంబు లాది. ౨౦
ఆదిత్యు లందేను నవుదు విష్ణువును,
నవుదు వెలుంగు లందంశుమంతుండు
నగు రవిని, మరుత్తులందు మరీచిఁ,
జంద్రుఁ డే నగుదు నక్షత్రంబులందు. ౨౧
వేదంబులను సామవేదంబు నౌదు,
నేను దేవతలందు నింద్రుండ నౌదు,
నింద్రియంబులయందు నే నౌదు మనసు,
నవుదు భూతంబులయందుఁ జేతనము. ౨౨
రుద్రులందును శంకరుండను నౌదు,
యక్షరాక్షసులందు నవుదు ధనదుఁడ,
వసువులయందును బావకుం డౌదు,
శిఖరులందును మేరుశిఖరిని నేను. ౨౩
అవుదుఁ బురోధసులందు ముఖ్యుండు
నగు బృహస్పతి యని యర్జునా, యెఱుఁగు,

గాలంబు నౌదు లెక్కసలుపు వారి
యం, దేను మృగముల యందు సింహంబు,
పక్షులయం దౌదు వైనతేయుండ. ౩౦
ప్రసరించువానిలోఁ బవనుండ నేను
రాముఁడ నేను శస్త్రధరుల యందు,
మత్స్యంబులం దౌదు మకరంబు నేను,
నదులలోపలను జాహ్నవి నౌదు నేను. ౩౧
ఆదిమధ్యాంతంబె యౌదు సృష్టులకు,
విద్యల నధ్యాత్మవిద్యను బార్థ,
వాదులయం దేను వాదంబు నౌదు. ౩౨
ఔదు నకారంబు నక్షరంబులను,
మఱియు ద్వంద్వమును సమాసంబు లందు,
నక్షయం బగు కాల మౌదును నేనె,
యెల్లమోములవాఁ డయినధాత నేను. ౩౩
ఏ సర్వము హరించు మృత్యువు నౌదుఁ,
బుట్టువు నేఁ బుట్టఁబోవు వానికిని,
స్త్రీలయందు ధృతియు శ్రీయును గీర్తి
మేధయు క్షమయును స్మృతియును వాక్కు. ౩౪
సామంబులను బృహత్సామంబు నేను,
నవుదు ఛందముల గాయత్రిని నట్లె,
మాసంబులం దేను మార్గశీర్షంబు,
ఋతువులయం దౌదు నే వసంతంబు. ౩౫

ద్యూతంబు నే నగుదును వంచకులను,
తేజస్వులందు నేఁ దేజంబు నౌదు,
జయమౌదు నే వ్యవసాయంబు నౌదు,
సాత్త్వికులకు నౌదు సత్త్వంబు నేను. ౩౬
వాసుదేవుఁడ వృష్ణి వంశ్యుల నౌదుఁ,
బాండవులందును బార్థుండ నేను,
వ్యాసుండ మునులలోపల నేను మఱియుఁ,
గవులలోన నుశనాకవియును నేను. ౩౭
నేను దండమవుదుర్జ శిక్షకులందు,
నవుదు జిగీషులయందు నీతియును,
గుహ్యంబులందు నగుదును మౌనంబె,
జ్ఞానులయందును జ్ఞానంబు నేను. ౩౮
సర్వభూతముల బీజం బేది గలదో
యదియు నే నౌదు చరాచరం బైన
యట్టి భూతం బెద్ది యగును నాచేతఁ
గానిది యట్టిది కౌంతేయ, లేదు ౩౯
నాదు దివ్యంబులైన విభూతులకునుఁ
బొసఁగదు తుద; యీ విభూతి విస్తరము
పార్థ సంగ్రహముగఁ బల్కితి నేను. ౪౦
ఏది శ్రీమంతంబు నేది యూర్జితము
నైశ్వర్యయుక్తంబు నౌ సత్త్వ మేది
యేది యున్నది యది యెల్లయు నాదు

తేజోంశజంబని తెలిసికొ మ్మీవు ౪౧
ఇంక నీ విరివిగానైన *యెఱుకతో నీకు
నేల యీ జగమంత నేకాంశమునను
నెకొల్పి యున్నాఁడ నేను గాంతేయ ౪౨

పదునొకొండవ అధ్యాయము.

విశ్వరూపసందర్శనయోగము.

అర్జునుఁడు పల్కె.

నను గరుణింపఁగాఁ బరమమైనదియు
నాధ్యాత్మికంబు గుహ్యమగు నే వాక్కు
నిగదితం బయ్యెనో నీచేత దాన
నాది యీ మోహంబు నాశంబు నొందె ౧
భూతసంభవలయంబులను నీ వలన
విరివిగ దేవ, నే వింటిఁగా నీదు
నవ్యయం బైన మాహాత్మ్యంబుఁ గూడ. ౨
ఎట్లని పల్కితి వీవు ని న్నిద్ది
పరమేశ, యిట్టిదే, పరమాత్మ, నీది
యైశ్వరమా రూపునాశింతుఁ జూడ. 3
స్వామి, నాచేఁ గాంచఁ బడ నౌ నదియని

* పాఠాంతరములు. ౧ కిం జ్ఞానేన. ౨ కిం జ్ఞాతేన.

యెంచెదవేని యోగేశ్వర, నాకు
నంతఁ జూపింపు మవ్యయమగు నిన్ను ౪

శ్రీభగవంతుఁడు పల్కె.

పలురంగు రూపుల పలుతెఱంగులవి
యైనట్టి దివ్యంబు లైన నూఱువేలు
నగు నాదు రూపంబు లర్జున, కనుమ. ౫
ఆదిత్యవసువుల నశ్వినుల నర,
రుద్రులం గూడు మరుత్తులం, బెక్కు-
మును గననట్టి యబ్బురములనంత ౬
సచరాచర మఖిలజగముఁ గూడు నర,
యిఁక నేమిఁ గాంచఁగా నిచ్చగింతు వది
యిప్పుడు నా దేహమందొకట నొక్కటిదిగ. ౭
ఈ నీదు కన్నునన్ నన్నుఁ జూడఁ
జాలవు గాన నొసంగెద నీకు
దివ్యచక్షువును నాది యగు యోగంబు
నైశ్వర్యంబును నైన యది కనుఁగొనుమ. ౮

సంజయుండు పల్కె.

హరి మహాయోగేశుఁడని యిట్లు రాజ,
యంతఁ గనుపఱచె నర్జునునకయి
యైశ్వర్యంబుఁ బరమమైన రూపంబు ౯
పలుమోము కనులది పలుమేల్ నగలది
పెక్కులునైనట్టి వింతచూపులది

తిగిచినట్టి యనేక దివ్యాస్త్రములది ౧౦
మేలి పుట్టములది మేలిదండలది
మేలైన గందంపు మెయి పూఁతఁ గలది
తుదలేని యది విశ్వతోముఖంబు మఱి
యఖిల మాశ్చర్యమయ మవు దైవంబు. ౧౧
ఆకాశమందును సూర్యసహస్రము దగు
కాంతియు నొక్కటం గలిగెనే నద్ది
యా మహాత్ముని వెల్గు కౌను సదృశము. ౧౨
దేవదేవునియొక్క దేహంబునందు
నచట నొక్కటనున్న యఖిలజగంబుఁ
బెక్కు తెఱంగుల వేర్వేరు గాను
నైన దానిని గాంచె నంతఁ బార్థుండు ౧౩
అంత విస్మయ మంది యా పార్థుఁ డొడలు
పులకరింపంగ దేవుఁ దలతో మ్రొక్కి
యనియెను హస్తద్వయంబును మోడ్చి ౧౪

అర్జునుఁడు పల్కె.

దేవ కాంచెదు నీదు దేహంబునందు
భూతవిశేష సమూహంబుల, మఱి
సర్వదేవతల, నీశ్వరుఁ డగువానిఁ
బద్మాసనస్థుని బ్రహ్మను మఱియు
నిఖిలఋషుల నురగదివ్య సర్పముల ౧౫
మోముల్ గనుల్ కేలు బొజ్జలు పెక్కు

కలవాని నన్నిప్రక్కలఁ దుది లేని
* యడవానిగ నిను విశ్వాధిప, కాంచు
వాఁడను విశ్వరూప, మఱియు నీదు
మొదలును దుది నడుమును గనుగొనను. ౧౬
గదిని గిరీటిఁ జక్రధరు సంతతమును
వెల్గు వానిని జూడ వెరవు గా నట్టి
వానిఁ దేజోరాశి భాసించు నట్టి
సూర్యాగ్ని తేజు నెంచుటకు సాధ్యంబు
గాని వానిగ, నిన్నుఁ గాంతు నెల్లెడల. ౧౭
పరముఁడ వెఱుఁగఁగా వలయు వాఁడవును,
నీ వక్షరుండవు, నీ విశ్వమునకుఁ
బరమనిధాన, మవ్యయుఁడవు నీవు,
పురుషుండ వగుదునీవు సనాతనుఁడవు,
శాశ్వత ధర్మరక్షకుఁ డని తలఁతు. ౧౮
మొదలును దుది నడుమును లేనివానిఁ
గడలేని వీరంబు గలిగినవాని
లెక్క లేకున్న కేల్ నెక్కొన్నవాని
నెలప్రొద్దు కన్నులు నెలకొన్నవాని
వెలుఁగొందు నగ్నివా చెరసినవాని
నీ జగముఁ దనవెల్గే ర్చెడువాని
గాఁగను నే నిన్ను గాంచుచున్నాఁడ ౧౯

* అడ = ఆకృతి.

ఈ భూనభోంతరం బెల్ల కడలును
నీ యొక్కనివలన నిండంబడెఁగద !
అద్భుతంబును నుగ్రమైన యీ నీదు
నాకారము గని మహాత్మ, లోకములు
మూడు భయంబును బొందుచున్నయవి ౨౦
చొచ్చుచున్నార లీ సురతతుల్ నిన్ను,
కొందఱు భీతులై కూరిచి కేలు
నగ్గించుచున్నారు, స్వస్తి యటంచుఁ
బుష్కల స్తవములఁ బొగడుచున్నారు
నిన్ను సిద్ధమహర్షి నికరంబులు గద. ౨౧
ఆదిత్యరుద్రులు యక్షు లసురులు
పితరుల్ వసువులు విశ్వేదేవతలును
సిద్ధగంధర్వు లశ్వినులు వాయువులు
సాధ్యులు ననువారి సంఘంబు లెల్ల
వీక్షించు నిన్ను నివ్వెఱపాటు తోనె. ౨౨
పెక్కు మోములు కనుల్ పెక్కు బాహ్వలది
కాళుల్ దొడల్ కేలు గలది పెక్కింటి
పెక్కు కోఱలచేత బెడిదమైన యది
నై ప్రబలంబును నైనట్టి నీదు
రూపంబుఁ గనుఁగొని బ్రుంగెడు భీతి
లోకముల్ నేను నట్లు నయితి శూర. ౨౩
నభము నంటి హరి, నానావర్ణములను

గలిగి వ్యాత్తాస్యంబుఁ గలిగి జ్వలించె
నాయతాక్షము లున్న యట్టి నిన్గాంచి,
యైతిఁ బ్రవ్యథితాంత రాత్ముండ నాకు
ధైర్యంబు శమమును దక్కవు గాదె! ౨౪

కాలాగ్నితుల్యముల్ గాఁగ, దంష్ట్రలను
భయదంబు లౌ నీదు వక్త్రముల్ గాంచి
యెఱుఁగఁగా! దెసలు, లభింపదు సుఖము;
దయఁ జూపు దేవనాథ, జగన్నివాస. ౨౫

ఈ ధార్తరాష్ట్రులు నెల్ల భీష్ముఁడును
ద్రోణుండు నవనీశ్వరుల సమూహంబు
తోనె యీ కర్ణునితోడ, మా వారు
నౌ యోధముఖ్యుల్, భయదమగు నీదు
దంష్ట్రాకరాళ వక్త్రముల వేఁ జొచ్చు
వారలు, కొందఱు పండ్లలోఁ జిక్కి
పొడియైన తలలతోఁ బొడసూపు వారు. ౨౬, ౨౭

ఏరుల పలు నీరు లెట్టుల వేగ
సంద్రంబునే చేరఁ జనియెడు నట్లు
వీరలు నరలోక వీరులు నీదు
వ్రేఁగు మోములను బ్రవేశించువారు. ౨౮

దీపించు నగ్ని నే తీరు నాశమునకు
మిగుల వేగమె చొచ్చు మిడుతలు, నట్లె
చేరు లోకంబులు చెడ నీ ముఖముల

యందును బూర్ణంబు నైన వేగమున. ౨౯
కనలెడి ముఖములఁ గలయ భక్షించి,
చవి గొనుచున్నావు సకలలోకములఁ;
దేజంబుల న్నించి దేవ, నీ కఱకు
మించులు జగ మెల్ల మిక్కిలిఁ గ్రాఁచు. 30
ఉగ్రరూపంబున నుండు నీ వెవఁడొ
నా కాన తీ గదే నతి యగు నీకు;
దేవేశ్వరుఁడ, ప్రసాదింపు మాద్యుఁడవు
నగు నిన్ను నెఱుఁగఁగా నాశించు వాఁడ,
నే నీ ప్రవృత్తిని నెఱుఁగను గాదె. 3

శ్రీభగవంతుఁడు పల్కె.

లోకక్షయముకై పెలుచనఁ బెరిగిన
కాలుండ; లోకముల్ కడప నున్నాఁడ
నిప్పుడు; నీవు లేవేనియుఁ గాని
ప్రత్యనీకముల నెవ్వార లున్నారొ
యుండఁగాఁ జోవ రా యోధు లెల్లరును.

కావున లె మ్మీవు కై కొమ్ము యశము,
రిపుల జయించి సమృద్ధ రాజ్యమ్ము
నాను, నాచేన నిహతులు వీర్ మున్నె,
కారణమాత్రమ్ము కమ్ము కౌంతేయ.
నాచేతఁ బడిన సైంధవునిని ద్రోణు

భీష్ముఁ గర్ణుని యోధవీరుల నొరుల
సైతముఁ జెక్కాఁడు, సమరంబు సల్పు,
ఆజిఁ గెల్తు వరుల వ్యథఁ జెందవలదు. ౩౪

సైంధవుఁడు పల్కె.

౩౫ విశ్వేశు నీ పల్కు విని యర్జునుండు
కేల్మోడ్చి వడఁకుచుఁ, గృష్ణుతో, నెరఁగి
కడుఁగడు బెగడుచు గద్గదికంబు
ప్రభవింప నమ్రుఁడై, పలికెను మరల. ౩౫
నీ కీర్తనంబునఁ బ్రియమంది జగము
౩౬ హర్షించు; రక్కసు లదరి దిక్కులకు
నుఱుకువా, రెల్ల సిద్ధౌఘంబు నతులు
పొనరించు చుండుఁ, దవును హృషీకేశ. ౩౬

ఆదికర్త వయి బ్రహ్మకు నెక్కుడు నగు
నీకు దేవేశ, దేనికయి యొరఁగరు,
ఓ యనంత, మహాత్మ, యో సురేశ, యొది,
౩౭ సదసత్పర మల యక్షర మవు దీవు. ౩౭

ప్రథమదేవుఁడవు, పురాణపురుషుఁడు,
ఈ వనంతాకార యీ విశ్వమునకుఁ
బరమనిధానంబు, పరమధామంబు
౩౮ వేద్యుండవు మఱియు వేత్త వవుదువు,
నీచేత విశ్వంబు నిండఁగాఁ బడియె. ౩౮

వాయువు నగ్నియు వరుణుండు యముఁడు
ప్రపితామహుఁడు ప్రజాపతియుఁ జంద్రుండు
నీవు దండం బగు నీకును వేయి
మాఱులు దండంబు మరలను గూడ
దండంబు మగుడియు దండంబు నీకు ౩౯
దండంబు మునుపును దండంబు వెనుక,
అఖిలుండ, నతి నీకు నంతటఁ గూడ.
అమిత విక్రముఁడ వనంత వీర్యుఁడవు,
వ్యాపించి యున్నాఁడ వంతయుఁ జెక్క,
నవుటచే సర్వుండ వైనావు నీవు ౪౦
ఈ నీదు మహిమంబు నెఱుఁగమి కతన
మచ్చికచేతనేఁ మరి ప్రమాదమున
నేఁ సఖుఁడని యెంచి యేఁ బ్రసభమున
యాదవ, కృష్ణ, సఖా, యన్నదాని
శయ్యాసనముల భోజనవిహారముల
యందొంటి పాటనే నందఱిలోన
నేని గేలికి నసత్కృతి సల్పినట్టి
దానిని నే వేడెదను క్షమియింప,
నప్రమేయుఁడ వగు నచ్యుత నిన్ను ౪౧, ౪౨
ఈ చరాచరము నయిన లోకమునకు
నీ, వయ్య పూజ్యుండు నెక్కుడౌ గురువు,
సాటివార్ నీకు ముజ్జగములయందు

గూడను లే రధికు లయిన లాఁతి
వార లేడుందు రప్రతిమప్రభావ ౪౩
ఏఁ, గాన, నీశుండు నీడ్యుఁ డౌ నిన్నుఁ,
న్నొడలు వంచి ప్రణామ మొనరించి నేను
స్వామి, వేడెద నఁక బ్రసాదింపఁగాను,
ప్రియను బ్రియుఁడు వోలెఁ బిత సుతుఁ బోలె
సఖుని సఖుఁడు వోలె సైఁపనౌ నీకు. ౪౪
కన నట్టియది మునుఁ, గని సంతసింతు,
భయమునఁ నా మది వ్యధితమయ్యెఁ గడు,
నా కల్ల రూపంబె నాథుఁడ, చూపు,
దయసల్పు దేవనాథ, జగన్నివాస. ౪౫
గదిని గిరీటిఁ జక్రకరుని గాను
నిన్నట్లె చూడఁగా నేఁ గోరు దగుమ
యల చతుర్భుజముల యాకృతితోనె,
యోయి సహస్రబాహుఁడ, విశ్వమూర్తి. ౪౬

శ్రీ భగవంతుఁడు పల్కె.

ఆద్యంబు, తేజోమయం, బనంతంబు,
విశ్వంబు, నీకన్నఁ బెరవారి చేతఁ
బొడగాంచఁ బడనిది మును, బరమంబు
నైన యీ రూపంబు నర్జునా నీకు,
నను కంపకతమ్మున, నాత్మయోగంబు
వలనఁ గాన్పింపఁగాఁ బడియె నాచేత. ౪౭

యజ్ఞ వేదక్రియాధ్యయన దానములఁ
దీవ్రతపమ్ముల దేనిచేఁ గాని,
నీకన్న నొరులకు నృజగమున నర,
ఈరూపమునఁ గాంచ నే నసాధ్యుండ. ౪౮

ఇట్టి నాఘోర మయిన రూపము గని
వలదు విమూఢభావము వ్యథ వలదు,
భయ మేది ప్రియమెదం బడసి మగుడియు
నీక్షింపు మల్లదే యీ నాదు రూపు. ౪౯

సంజయుండు పల్కె.

అంత నిట్లని కృష్ణుఁ డర్జునునకును
గ్రమ్మఱఁ దనరూపుఁ గాన్పించె, మరల
సౌమ్యదేహము గొనుచేను మహాత్ముండు
నూరడించె భయం బొందిన వీని. ౫౦

అర్జునుండు పల్కె.

సౌమ్య మౌ నీ మానుషం బైన రూపు
నిది గని యెప్పట ట్లిపు డైతిఁ గృష్ణ,
స్వస్థ చిత్తము గల వాఁడను నైతి. ౫౧

శ్రీ భగవంతుఁడు పల్కె.

ఈవు కాంచిన యట్టి యీ నాదురూపు
కడుఁ గనరానిది, కాంచ నీరూపుఁ
గోరుచుందురు సురల్ కూడ నెల్లపుడు. ౫౨

ఈవునను గనినట్టి యీరీతి నన్నుఁ
గనరాదు వేదయజ్ఞంబులఁ గాని. ౫౩

దానంబులను గాని తపముచేఁ గాని
అర్జున నన్నిట్ల నన్యమౌ భక్తి
వలనను నిజముగా వాటమౌఁ దెలియఁ
గనుఁగొనఁగను బొందఁగాఁ బరంతపుఁడు. ౫౪

కర్మంబులను నాకుఁగాఁ జేయువాఁడు,
నను బరమంబుగ గైకొనువాఁడు,
సంగ మేదిన వాఁడు, సర్వభూతముల
వైర మొందనివాఁడు, భక్తుండు నాకుఁ,
బాండవ యెవ్వండు వాఁడు నన్నొందు. ౫౫

పండ్రెండవ అధ్యాయము.

భక్తియోగము.

అర్జునుఁడు పల్కె.

ఎపు డిట్లు యుక్తులై యెవ్వారు నిన్ను
భక్తులు లెస్స యుపాసింత్రు; మఱియు
నవ్యక్త మగునట్టి యక్షరం బెవరు?
ఎవ రందు యోగ మెచ్చెఱిఁగనవారు? ౧

శ్రీ భగవంతుండు పల్కె.

నాపై మనమిడి సంతతయుక్తు లగుచు
శ్రేష్ఠ మౌ శ్రద్ధ నన్ సేవింతు రెవరు,
వార్ యుక్తతము లని భావింతు నేను ౨
ఇంద్రియగ్రామంబు నెక్కడు నిల్పి
యఖిలభూతహితంబు నందు సక్తులయి
యన్నింట సమబుద్ధి నందిన వాఁడు
నిత్యం బచింత్యం బనిర్దేశ్యము మఱి
యక్షరం బవ్యక్త మచల మున్నయది
యంతటఁ గూటస్థ మవుదానిఁ గొల్చి
పొరినేరు, వార్ నన్నె పొందఁగాఁ గలరు ౩, ౪
అవ్యక్తమున మది యానువారి కగు
నధికతరక్లేశ, మవ్యక్తము దగు
తె న్నొందఁ జిక్కుఁగ దేహవంతులకు ౫
అఖిలకర్మముల నాయందు నర్పించి
మత్పరు లై యొండు మాని న న్నంటి
నన్నుఁ దలంచుచు ననుఁ గొలుచుచును
నాపై నిలిపిన మనసుఁ గలవారి,
మృత్యుసంసార వారిధిని వేగంబు
దాఁటించువాఁడఁ బార్థ, యపుడు నేను. ౬, ౭
నాయందె మనమును నాటుము, బుద్ధి
నాయందె నిలుపుము, నాయందె యవల

నివసింపఁగలవు సందేహంబు లేదు. ౮
స్థిరముగా నాపైనఁ జిత్తంబు నిలకను
నాటలేవే నంత, నన్ గోరు పార్థ,
౨ ఝొందఁగా నభ్యాస యోగంబువలన. ౯
అసమర్థుఁడ వవుదే నభ్యాసమునను,
నా కారియంబులన్ బరమంబుఁగ గొను.
కర్మముల్ నాకయి కావించుచున్న
వాఁడ వైయును సిద్ధిఁ బడయఁగాఁ గలవు. ౧౦
ఓపవే నిఁక నదియుం జెలుపంగ,
నాని నా *కలువ యతాత్ముండ వగుచు
౪ నిఖిలఫలత్యాగ మంత నొనర్పు. ౧౧
జ్ఞాన మభ్యాసంబుకన్న మేల్ గాదె,
జ్ఞానంబుకన్న ధ్యానంబు గొప్ప యగు,
౫ ఘనము ధ్యానముకన్నఁ గర్మఫలంబు
నుడుగుట, యుడుగుట నొదవు శాంతి యట. ౧౨
నిఖిలభూతంబుల న్నిరై వైరుఁడు మఱి
కరుణయు మైత్రియుఁ గలిగిన వాఁడు
సమ దుఃఖసుఖుఁడును క్షమి యతాత్ముండు
నిరతసంతుష్టుండు నిరహంకృతుండు
౬ నిర్మముండును దృఢనిశ్చయుండు మఱి
నాదు భక్తుఁడు యోగి నాపై నిలిపిన

* కలువ = కలయిక.

*కఱదయు నెడదయుఁ గలిగిన యట్టి
వాఁ డెవ్వఁ డయ్యెడు వాఁడు మత్ప్రియుఁడు. ౧౩,౧౪
వ్యథఁ జెంద దెవ్వాని వలన లోకంబు
వ్యథ యేఁడులోకంబు వలనఁ జెందండో
భయము నుద్వేగకోపములు హర్షంబు
విడిచినాఁ డెవ్వాఁడు ప్రియుఁడు నా కతఁడు ౧౫
అనపేక్షుఁడును గతవ్యథుఁడు దక్షుండు
అన్ని యారంభంబు లాగిన యట్టి
వాఁ డుదాసీనుఁ డౌ వాఁడును శుచియు
భక్తుఁ డెవ్వఁడు నాకు వాఁడు మత్ప్రియుఁడు. ౧౬
పొంగఁడు కోరఁడు పొగలఁడు కినుక
నొందఁడు మేల్కీడు లూడినవాఁడు
భక్తిమంతుఁ డెవఁడో వాఁడు మత్ప్రియుఁడు ౧౭
శత్రుమిత్రులయందు సముఁడును, నట్లె
యవమానమానంబు లందును, సముఁడు
దుఃఖసుఖంబులఁ, దుల్యుఁడౌ వాఁడు
శైత్యోష్ణములయందు, సంగవర్జితుఁడు,
స్తుతినిందలందును దుల్యుండు, మౌని,
స్థిరమతి, తృప్తుండు దేనిచే నైన,
నని కేతుఁడును, నగు నట్టి నరుండు
భక్తిమంతుం డైన వాఁడు మత్ప్రియుఁడు ౧౮,౧౯

* కఱద=బుద్ధి.

ఇద్దె ధర్మ్యామృతం బెట్లు చెప్పఁబడె
నట్లు శ్రద్ధ గలిగినట్టి వారలయి
మత్పరము లగుచుం భజియింతు రెవరో
భక్తులు కడుఁ బ్రియుల్ వారును నాకు. ౨౦

పదుమూఁడవ అధ్యాయము.

క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగము.

అర్జునుఁడు పల్కె.

జ్ఞేయంబు జ్ఞానంబు క్షేత్రంబు మఱియు
క్షేత్రజ్ఞుఁ బురుషుఁ బ్రకృతిఁ గూడ నిద్ది
యెఱుఁగఁగాఁ గోరెద నేను శ్రీకృష్ణ.

శ్రీభగవంతుఁడు పల్కె.

ఈ యొడల్ క్షేత్ర మండ్రిది యెవ్వఁ డెఱుఁగుఁ
దద్విదుల్ వాని క్షేత్రజ్ఞుఁ డండ్రు నర. ౧
క్షేత్రంబులం దెల్ల క్షేత్రజ్ఞుఁ గాను
గూడ నన్నెఱుఁగుము కుంతీజ, యేది
క్షేత్రజ్ఞుని మఱియు క్షేత్ర మెఱుఁగుట
యగు నది జ్ఞానం బటంచు నా మతము ౨
ఎద్ది యా క్షేత్రంబు నేలాటి యద్ది
యే వికారములది యేమి యెందలిది,

ఎవ్వండు వాఁడును నే ప్రభావమును
గలవాఁ డది విను సంగ్రహముగ నన్ను. 3
ఋషులచేతను బహురీతుల మఱియు
నానావిధముల ఛన్దంబులచేత,
హేతుమంతంబుల యివి నిశ్చితములు
నగు బ్రహ్మసూత్ర వాక్యంబులచేతఁ
గూడ వేర్వేఱ వాక్రువ్వఁగాఁ బడియె ౪
అవ్యక్తము, మఱి మహాభూతములును,
బుద్ధి, యహంకారమును, ద్వేష, మిచ్ఛ,
ధృతియుఁ, జేతనయు, నింద్రియగోచరములు
నేను, బదియు నొక్క టింద్రియములును,
దుఃఖంబు, సుఖమును, *దొట్టువ యిద్దె
క్షేత్రమానదియు సంక్షేపంబు గాను
సవికారముగను బ్రచారింపఁ బడియె. ౫,౬
మాన దంభంబుల మాను, టార్జవము,
నాచార్యుఁ గొలుచుట, యాత్మనిగ్రహము,
శౌచంబు, స్థైర్యంబు, క్షాంతి, యహింస,
ఇంద్రియార్థంబుల యెడ నిరాశయును,
అనహంకృతి, జరామయములు దుఃఖంబు
జన్మమృత్యువుల దోషము లెఱుంగుటయు,
గృహసుతదారాదు లెడ నసక్తియును

* తొట్టువ = వర్గము, సమూహము.

బెను గూర్మిలేమి, యేవేళ నిష్టంబు
గాని యనిష్టంబు గాని గలిగిన
తరుణమున సమచిత్తతయు, నాపైనఁ
జెదరని యొరులను జేరని భక్తి.
జనసంఘమందు నసక్తి, విడియగు
నెడనుంట, యధ్యాత్మ మెఱుఁగటఁ స్థిరత,
తత్త్వంపు జ్ఞానార్థ దర్శనంబు, నిది
జ్ఞానంబు దీనికన్నను వే ఱగునది
యజ్ఞాన మను నది యని పల్కఁబడియె. ౭,౮,౯,౧౦,౧౧
ఎయ్యది తెలియనౌ నెయ్యదెఱుంగ
నమృతంబు వడయనౌ నది యనాదియును
మత్పరంబు నగు బ్రహ్మ మది వచింతు.
సత్తని దాని నసత్తని యనరు. ౧౨
అంతటఁ గాల్ కేలు నంతట మోము
తలకనుల్ వీనులంతటఁ గల్గి జగము
నందంతయును నిండి యయ్యె దున్నయది. ౧3
అదివెల్గు నఖిలేంద్రియగుణంబు లంటి
ఇంద్రియంబులలోన నెవ్వి లేనియది,
అయ్యు నసక్తంబు నన్ని భరించు,
గుణములు లేదయ్యు గుణములం గొనును,
బైట, భూతముల లోపల, నున్న యద్ది,
చరమును, నచరంబు సౌక్ష్మ్యంబు కతన

నెఱుఁగరానిది, యది యెడ నున్నదియును
గడ నున్నది, యవిభక్తంబయ్యు నద్ది
భూతముల విభక్తమువలె నున్నదియు,
భూతంబులను బ్రోచుఁ బొడమించు మ్రింగు
నదియుఁగా నెఱుఁగంగ నౌ నది, వెలుఁగు
గలవాని వెలుఁగండ్రు, కానిది తమము,
జ్ఞానంబు జ్ఞేయంబు జ్ఞానగమ్యంబు, [౧౬, ౧౭, ౧౮
నన్నింటి హృదయంబు లందుండునదియు ౧౪, ౧౫,
క్షేత్రంబు జ్ఞానంబు జ్ఞేయంబు నిట్లు
కథితంబు లయ్యె సంగ్రహముగ, నాదు
భక్తుం డిదెఱిఁగి మద్భావంబున కగు ౧౯
ప్రకృతిపురుషుల నుభయులను గూడ
నెఱుఁగు మనాదులె, యెఱుఁగు గుణములు
మఱి వికారంబులుం బ్రకృతిఁ గల్గునని ౨౦
కార్యకారణములఁ గలిగించుటందుఁ
బ్రకృతి హేతు వగు నా వచియింపఁ బడును,
బురుషుండు సుఖదుఃఖములను గుడుచుట
యందు హేతువగు నా ననఁగను బడును. ౨౧
ప్రకృతి స్థితుండయి ప్రకృతిజంబులగు
గుణములం బురుషుండు గుడుచును గావె
వాని మేల్ కీ *డిక్కవలఁ బుట్టుటకును

*ఇక్కవ = స్థానము.

గారణంబు గుణసంగంబు నయ్యెడును ౨౨
ఈమేనను బరుండయిన పురుషుండు
భర్త భోక్తయు మహేశ్వరుఁ డనుమోది
పరమాత్మ యనియు నుపద్రష్ట యండ్రు ౨౩
పురుషుని మఱిగుణంబులతోడఁ బ్రకృతి
నెవ్వాఁ డెఱుంగునో యిట్లతఁ డన్ని
౧౮ తెఱఁగుల నున్నను దిరిగి పుట్టండు ౨౪
౧౫ ఆత్మఁ గాంచెద రాత్మయం దాత్మచేత
ధ్యానానఁ గొందఱితరులు సాంఖ్య మగు
యోగంబునను, గర్మయోగాన నొరులు ౨౫
౧౯ ఇట్లెఱుంగని యొరు లితరుల వలన
విని యుపాసింతురు, వినుటయం దాస్థ
యున్నట్టి వారలు నవు వారు గూడఁ
౨౦ దప్పక మృత్యువుఁ దాఁటంగఁ గలరు ౨౬
సత్త్వ మేదేఁ గల్గు జంగమం బేని
స్థావరం బేని బార్థ దాని నెఱుంగు
క్షేత్రంబు క్షేత్రజ్ఞు చేరిక నాఁగ. ౨౭
౨౧ సర్వభూతంబుల సమముగా నుండు
పరమేశ్వరుఁ గను నశ్వరములలోన
*నీల్గని వాని నెవఁడు వాఁడు కను. ౨౮
సర్వత్ర సమముగ సమవస్థితునిగ

* ఈల్గు=చచ్చు.

నీశ్వరుఁ గనుచుఁ దా హింసించుకొనఁడు
తన, నంతఁ బరమపదం బొందుఁ గాదె. ౨౯
ఎల్లకర్మములు ప్రకృతిచేన జేరగు,
కావించు నది కాదు కావున నాత్మ,
యని కాంచు నెవ్వండు కనువాఁడు వాఁడు. 3౦
భూతముల విభేదము నొకట నుంట
నెదుగుట యందుండియే యాట నెపుడు
కనుగొను నప్పుడు కలియు బ్రహ్మంబు. 3౧
గుణరహిత మనాదగుట నవ్యయంబు
నయినట్టి యీ పరమాత్మ దేహమున
నుండియు నర, నల్ప దొందదు సోఁకు. 3౨
సర్వగతంబయ్యు, సౌక్ష్మ్యంబు కతన
నాకాశ మెట్టుల నంటఁగా రాదో,
యట్లె దేహంబు నందంతట నుండు
నట్టి దౌ నాత్మయు నంటఁగా రాదు. 33
ఈ సర్వలోకంబు నిను డొక్కరుండు
వెల్గించు నెట్టుల విజయ యట్టులను
క్షేత్రంబు నంతయు క్షేత్రి వెల్గించు. 3౪
భూతప్రకృతి మోక్షమును మఱి యెవరు
క్షేత్రంబునకు మఱి క్షేత్రజ్ఞునకును
గలుగు నీ భేదంబు జ్ఞాన చక్షువులను
గాంతురు వారలు కాంతురు పరము. 3౫

పదునాల్గవ అధ్యాయము.

గుణత్రయవిభాగయోగము.

శ్రీభగవంతుఁడు పల్కె.

ఇందుండి మునులెల్ల నెయ్య దెఱింగి
పరమసిద్ధి గనిరి పరమ మా నట్టి
యెఱుకలలో నెల్ల నెక్కుడౌ నెఱుక
మగుడియుఁ జెక్కఁగా మందలించెదను. ౧

ఈజ్ఞానము నుపాశ్రయించే వారలయి
నాదు సాధర్మ్యము న్గన్నట్టి వారు
సృష్టికాలంబునఁ జెందరు *బాము
ప్రళయకాలంబునఁ వ్యథయును గనరు. ౨

అగును నా యోని మహద్బ్రహ్మ, యందు
గర్భంబు నిలుపుదుఁ గౌంతేయ నేను,
సర్వభూతంబులు జన్మించు నంత ౩

సర్వయోనుల యందు జన్మించు నెవ్వి
యా మూర్తులకును మహద్యోని బ్రహ్మ,
బీజ ప్రదుఁడ నా పిత నేను పార్థ ౪

తమము రజంబు సత్త్వమను గుణములు
ప్రకృతిసంభవములు, బంధించు నొడలు

*బాము = జన్మము.

నందుఁ గౌంతేయ యవ్యయుఁ డగు దేహి. ౫
అందు సత్త్వము శుద్ధ మౌట వలనను
నగుఁ బ్రకాశకము ననామయ మనఘ
జ్ఞానసుఖంబులఁ గలసి బంధించు. ౬
రాగాత్మకంబని రజము నెఱుంగు
సంగంబుఁ దృష్ణ విజయ, కలిగించు
కర్మసంగంబుచేఁ గట్టు దేహి నది. ౭
అజ్ఞానజము తమ మని పార్థ యెఱుఁగు
అఖిలదేహులను మోహము గొల్పు కట్టు
నద్ది ప్రమాద నిద్రాలస్యములను. ౮
కౌంతేయ, సుఖమునఁ గలుపు సత్త్వంబు,
కర్మముల రజస్సు, జ్ఞానంబు నలమి
తమము ప్రమాదంబుఁ దవిలించుఁ గాదె. ౯
సత్త్వంబు నగు రజస్తమముల నడఁచి
సత్త్వతమముల రజంబును, దమము
సత్త్వరజముల విజయ, యదేరీతి. ౧౦
ఈ దేహ మందలి యెల్ల త్రోవలను
జ్ఞాన ప్రకాశము గలిగెడు నెపుడు
అపు డెచ్చినది సత్త్వ మని యెఱుంగునది. ౧౧
రజ మెచ్చి యుండఁ గర్మముల మొనయుట
స్పృహయు లోభంబు ప్రవృత్తి యశమము
పాండవ, యియ్యవి ప్రభవంబు నొందు. ౧౨

తమము పాండవ, వివృద్ధం బయి యుండ
నప్రవృత్తియును మోహము ప్రమాదంబు
నప్రకాశము నివ్వి యందు సంభవము. ౧౩
సత్త్వం బడరియుండఁ జనునేని దేహి
యప్పు డుత్తమవిదుల యవిర్లైన యట్టి
యమలలోకంబుల నందఁ గలండు. ౧౪
రజమునఁ జని కర్మరతులందుఁ బుట్టు,
తమమునఁ జనిన యాతండును నల్లె
మూఢయోనుల యందుఁ బొందు జన్మంబు. ౧౫
సాత్త్వికం బచ్ఛంబు సత్కర్మములకు
ఫలము, రజమునకు ఫలము దుఃఖంబు,
సంద్రు తమము ఫల మజ్ఞానము నని ౧౬
సత్త్వంబు వలనను జ్ఞానంబు, రజము
వలనను నగును లోభమె, తమమునను
గలుగుఁ బ్రమాద మజ్ఞాన మోహములె. ౧౭
సాత్త్వికుల్ మీఁదకుఁ జనుదురు, నడుమ
నిల్తురు రాజసుల్, నీచగుణముల
వృత్తుల తామసుల్ క్రింది కేగెదరు. ౧౮
కర్త గుణంబులకంటె నింకొకఁడు
కాఁడని యెప్పుడు గాంచు వివేకి
పొడగాంచెడిని గుణంబులకంటెఁ బరుని
నపుడు మద్భావంబు నొందెడు వాఁడు. ౧౯

దేహజంబు లగునీ త్రిగుణముల్ దాఁటి
పుట్టువు ముదిమి చావు వెతలవలన
విడువంగఁ బడి దేహి పెరయు నమృతము ౨౦.

అర్జునుఁడు పల్కె.

ఈ మూఁడు గుణముల నీఁదిన వాని
యానవా లేమార్య, యాచార మేమి?
ఈమూఁడు గుణముల నెట్టులఁ గడచు? ౨౧.

శ్రీ భగవంతుఁడు పల్కె.

సాత్త్వికం బేని రాజసమేని గాని
తామసం బేఁ గాని దాపురం బైన
వానిని గూరిచి వైరంబు గొనఁడు
కాంక్ష సేయఁడు పార్థ, కలుగనివాని. ౨౨
ఊరక చూచుచు నున్నవాని గతి
నిలుచును, నెవ్వానిని గదల్ప లేవు
గుణములు, వర్తించు గుణములే యంచు
నెవఁ డుండు, చలియింపఁ, డింపునొగుళ్ల
నొక్కటి గానుండు, నుండు స్వస్థుఁ డయి,
పొన్ను ఱాల్ మన్నొక్క పోలికఁ గాంచు,
నగు సముఁడు ప్రియాప్రియముల, ధీరుండు,
సముఁడును నిందాత్మ సంస్తుతు లందు,
నవమాన మానంబులందుఁ దుల్యుండు,
సముఁడు మిత్రారి పక్షంబులయందు,

ప్రారంభముల నెల్ల వదలినవాఁడు,
అతఁడు గుణాతీతుఁ డనిపల్కఁ బడెడు. ౨౩,౨౪,౨౫
కదులని భక్తియోగంబుచే నన్ను
గొలుచువాఁ డీఁది యీ గుణముల లెస్స
బ్రహ్మభావంబును బడయఁగాఁ గలఁడు. ౨౬
ఆశ్రయం బౌదుఁగా యమృత మవ్యయము
నైన బ్రహ్మమునకు నైకాంతిక మగు
సౌఖ్యమునకును శాశ్వత ధర్మమునకు. ౨౭

పదునైదవ అధ్యాయము.

పురుషోత్తమప్రాప్తియోగము.

పైన వేరులు క్రింది వైపునఁ గొమలు
నాకులు ఛందంబు లగు నవ్యయంబు
నైన యశ్వత్థంబు నని వచియింత్రు,
దాని నేఁ డెఱుఁగు వేదజ్ఞుండు వాఁడు ౧
ననలు విషయముల్, గుణప్రవృద్ధములు
దానివి కొమలు క్రిందను బైఁ బెరిగిన
యవిగ నుండును, మనుష్య జగతియందుఁ
గర్మాను బంధముల్ గానుండు దాని
మూలముల్ క్రిందివైపునఁ బర్వియుండు. ౨

దాని రూపంబు మొదలు మన్కియుఁ దుద
గానియు నిక్కడఁ గనుఁగొనరాదు,
ప్రబల మూలమగు నీ రావి దృఢ మగు
సంగరాహిత్యమణ శస్త్రాన నఱికి
యెటఁ జేరఁగా లేదొ యిఁక వచ్చుటట్టి
స్థానంబుఁ దగునంతఁ దడవికొనంగ
మొదలునాఁటి ప్రవృత్తి పారలె నెందుండి
యా యాదిపురుషునే *యాశ్రయింపఁదగు. 3, ౪
మోహం బహంకారమును లేనివారు
సంగదోషంబును జెంపినవారు
నధ్యాత్మనిత్యులు హతకాములు మఱి
సుఖదుఃఖము లనెడి జోడులు విడిన
యట్టి ప్రాజ్ఞులు కందు రా స్థిరపదము. ౫
దేనిని బొందినఁ దిరిగి రాఁ బోరు
దాని బావక చంద్రతపనులు వెలుఁగఁ
జేయ రయ్యది నాదు శ్రేష్ఠధామంబు ౬
జీవలోకంబున జీవుఁ డౌ నట్టి
యాది లేకున్న నా యంశంబె ప్రకృతి
యందుండు మనముతో నారైన యట్టి
యింద్రియంబుల నొనరించు కర్షణము. ౭
ఆశయం బందుండి యనిలంబు వలపుఁ

* ప్రపద్యేత్. పా. ప్రపద్యే.

బోలెను నీశుండు బొందెఁ బాయుతఱిఁ
బొందె నొందెడు నప్డుఁ బోవు వీనిఁ గొని. ౮
రసనంబు శ్రోత్రంబు ఘ్రాణంబు మనముఁ
జక్షువుల్ మఱియు స్పర్శనమునుం గూడి
భుజియించెను విషయంబులను నీతండు. ౯
ఉండువానిని జెచ్చు చుండెడు వాని
నేనిగుడుచే వాని నేఁ గుణాన్వితుని
గామూఢు లగువారు కనుఁ గొనలేరు,
కనుఁ గొనుదు రెఱుక కన్నులవారు. ౧౦
కాంతురు తమయందుఁ గలయట్టి వీని
యత్నించు యోగులు, నజ్ఞులు వీని
నకృతాత్ములు కనరు యత్న ముండియును. ౧౧
ఆదిత్యునందుండి యఖిలలోక మెది
వెలిఁగించు, నగ్నిని, విధునందు, నేది
గలదా వెలుఁగు నాదగా నెఱుగునది. ౧౨
భూమి నావేశించి భూతంబు లేను
దాల్తు నోజస్సుచేత రసాత్మకుఁ డగు
చంద్రునై ప్రోతు నోషధుల నన్నింటి. ౧౩
వైశ్వానరుండనై ప్రాణుల యొడలిఁ
బొదివి ప్రాణాపానములఁ గూడి నాల్గు
*నంగుల యన్నంబు నఱిగింతు నేను. ౧౪

* అంగు = అంగము, విధము.

అన్నింటి హృదయంబు లందుండు నిలిచి,
నన్నుండె స్మృతియు జ్ఞాన మపోహనమును,
వేదంబు లన్నింట వేద్యుండ నేనె
వేదాంతకృత్తేనె వేదవిదుఁడను. ౧౫
ఇర్వురు పురుషులు నిల క్షరాక్షరులె
యనఁగ, భూతంబులు నఖిలముల్ క్షరుఁడు
నందురు కూటస్థుఁ డక్షరుఁ డనియు. ౧౬
ఉత్తమపురుషుఁ డన్యుం డవ్యయుండు
ముల్లోకముల నిండి ప్రోచు నెవ్వండు
నా యీశుఁ 'బరమాత్మ' యనుచుఁ బల్కెదరు. ౧౭
క్షరమును దేన నేఁ గడతు నక్షరము
కన్నను నధికుండ నౌదును దానఁ
బురుషోత్తముఁ డనంగఁ బొలుతు లోకంబు ౧౮
నందును వేదంబు లందును గూడ.
ఎవఁడ సమ్మూఢుఁ డిట్లెఱుఁగును నన్ను
బురుషోత్తముఁ డని నృపుఁడ సర్వవిదుఁడు
వాఁడు కొల్చును సర్వభావమున నను. ౧౯
ఇటు గుహ్యతమ మైన యీశాస్త్ర మనఘ,
కఱపితి, నిది యెఱుంగఁ గృతకృత్యుండు
బుద్ధిమంతుండు నవును బృథాతనయ. ౨౦

పదునాఱవ అధ్యాయము.

దైవాసురసంపద్విభాగయోగము.

౧౫ ఆర్జవం, బభయంబు, యజ్ఞంబు, తపము,
సత్త్వ సంశుద్ధియు, స్వాధ్యాయము, క్షమ,
తేజంబు, శౌచంబు, ధృతి, భూతములను
౧౬ దయ, యలోలుత్వంబు, దానంబు, దమము,
ననతిమానిత్వంబు, నద్రోహము, మఱి
సత్యం, బహింసయు, శాంతియు, మఱియు,
౧౭ జ్ఞానయోగవ్యవస్థ, యపైశునంబు,
త్యాగంబు, హ్రీయు, మార్దవ, మచపలత,
యక్రోధమును దైవి యైన సంపదను
౧౮ దగఁ బుట్టువాని కొదవుఁ బాండవేయ. ౧, ౨, ౩
దంభంబు క్రోధంబు, దర్పముఁ బార్థ,
అజ్ఞానము, పరుషతాభిమానములె
యాసురీ సంపద కైనవాని కగు. ౪
౧౯ విడుదలకొఱకు దైవీసంపద యగుఁ
గట్ట నాసురియు, దుఃఖంబు వలదు,
పార్థ దైవి యగు సంపదకుఁ గల్గితివి. ౫
౨౦ ఈ లోకమున భూతసృష్టులు రెండు
నాసురంబును దైవి యనియు మాత్రంబె.
దైవంబు విరివిగాఁ దెలిపింపఁ బడియె,

విను మాసురంబును విజయ నావలన. ౬
ఎఱుఁగర్ ప్రవృత్తి నివృత్తు లాసురులు
నగు జనుల్ వారల యందు శౌచంబు
సత్యంబు గాని యాచారమేని లేదు. ౭
అప్రతిష్ఠం బసత్యం బనీశ్వరము,
కామంబు హేతువు గాఁగ నొండొంటఁ
గలిగిన యట్టిది గాక వే ఱేమి
కలదు జగమని వక్కాణింత్రు వారు. ౮
క్రూరకర్ములును దక్కువ బుద్ధివారు
నాని యీ మతము నష్టాత్ము లహితులు
జన్మించెదరు జగత్క్షయమునకు నయి. ౯
కొనలేని కామంబుఁ గూడి దంభంబు
మానమదంబులం బ్రబ్బి మోహంబు
వలనను గారాని పట్టులం బట్టి
వర్తించెద రశుచివ్రతు లగువారు. ౧౦
ప్రళయాంత మైన యపరిమేయచింత
నొందిన వారు, కామోపభోగంబు
పరమంబుగాఁ గొనువారు, నింతె యని
నిచ్చినవారునుం, గామంబు నాని
క్రోధ, మాస లను నూర్ పోఁగులచేతఁ
గట్టు వడినవారు కామంబుఁ గుడువ
నాసింతు రర్థచయను లక్రమమున ౧౧, ౧౨

పొందితి నేఁ డిది, పొందు దీ కోర్కెఁ,
గల దిది నా కింకఁ గలిగెడు మఱియు
నీ ధనంబును గూడ; నీ పగతుండు
హతుఁ డయ్యె నాచేత, నడఁచెదఁ దక్క
వారలఁ గూడను; ప్రభుఁడను నేను,
నేను సిద్ధుండను, నే భోగి, సుఖిని,
నాఢ్యుండ, బలియుఁడ, నభిజాతు; నాకు
నీడేఁ డొరుఁడు! వ్రేల్తు, నిత్తు, మోదింతు;
నిట్టు లజ్ఞాన మోహితులు పెక్కులగు
చిత్త విభ్రాంతులఁ జెందిన వారు
మోహ జాలంబుచేఁ బొరిఁ జుట్టఁగఁబడి,
కామభోగంబులం గడుఁ దగులుకొని
యశుచియగు నరకమందుఁ బడెదరు. ౧౩,౧౪,౧౫,౧౬.

స్తబ్ధు లా వా రాత్మ సంభావితులును
ధన మానమదములం దవిలిన వారు
విధి పూర్వకము గాక పేరున కైన
జెన్నముల్ డంబుగాఁ జెలిపెడి వారు. ౧౭

దర్పంబు బలము క్రోధంబు కామమును
హంకారమును లెస్స యాశ్రయించి తమ
దేహంబులను బరదేహంబు లందు
నుండు నాపై ద్వేష మొందు కూళలను

క్రూరుల *బరుల నెక్కుడు నసూయకుల
సతతమా నీచులఁ సంసార మునను
నాసురీ యోనుల యందె త్రోసెదను. ౧౮, ౧౯

ఆసురి యగుయోని యందున †నెనసి
పుట్టుక పుట్టుకఁ మూఢులు నగుచుఁ
బ్రాపింపకే నన్ను బాండవేయుండ,
యరుగుదు రింకను నధమ మా గతికి. ౨౦

ఆత్మను నాశనం బైన యట్టి యది
యిది కామమును గ్రోధ మింకను లోభంబు
నను మూడు తెఱఁగులు నౌ ద్వార మగును
నరకంబునకుఁ గావున ‡విడు మి మ్మూటి. ౨౧

పార్థ, తమమునకు ద్వారంబు లైన
యి మ్మూటి వలనను నెడయైన నరుఁడు
నాత్మ శుభంబును నాచరించెడిని
నంతటఁ బరమంబు నగు గతిం బొందు. ౨౨

ఎవఁడు శాస్త్రవిధిని నెడఁబాసి యిచ్చ
వచ్చినట్లు చరించు వాఁడు సుఖంబుఁ
గనఁడు సిద్ధిఁ బరమగతి నేని గాని. ౨౩

కానఁ గార్యంబు నకార్యంబు రూఢి
తెల్పఁ బ్రమాణంబు శాస్త్రంబు నీకు,

---

* బరి=శత్రువు. † ఎనయు=పొందు. ‡ ఏతత్త్రయం త్యజ.

శాస్త్రవిధానంబు శాసించు దాని
నెఱిఁగి చేల్పఁ దగుదు విచేటఁ గర్మంబు. ౨౪

పదునేడవ అధ్యాయము.

శ్రద్ధాత్రయవిభాగయోగము.

అర్జునుఁడు పల్కె.

శాస్త్రవిధి విడిచి శ్రద్ధతోఁ గూడి
జన్నంబు లెవ్వరు సల్పుదు రవ్వారి
నిష్ఠయు నేమి యనియెదరు కృష్ణ,
సాత్త్వికమా రాజసంబ తామసమ! ౧

శ్రీభగవంతుఁడు పల్కె.

ఒడలు తాలుపులకు నుండెడు నట్టి
స్వాభావిక మగు నా శ్రద్ధ ముత్తెఱఁగు,
సాత్త్వికి యనియు రాజసి యనియు మఱి
తామసి యనియును దానిని వినుము. ౨

సత్త్వాను రూప మా శ్రద్ధ యందఱకు,
కుంతీజ, శ్రద్ధతోఁ గూడిన యట్టి
యీ పురుషుఁ డెవఁడో యెట్టిశ్రద్ధ గల
వాఁడో వాఁడును నట్టి వాఁడె యయ్యెడును. ౩

పూనరింత్రు దేవుల పూజ సాత్త్వికులు
రాజసులును యక్షరాక్షసుల మఱి
తామస జనులైన తక్కిన వారు
పూజింత్రు ప్రేతముల్ భూతగణములు. ౪
తనువున నున్న భూతగ్రామము మఱి
యంత శ్శరీరస్థుండౌ నన్నుఁ గూడ
నలుపు వారై యహంకారదంభములఁ
గామంబు బలము రాగంబులం గూడి
యెవ్వారు జ్ఞానవిహీనులౌ జనులు
భయదంబు మఱి శాస్త్రబాహ్య మౌ తపము
నెరపువా రాసుర నిశ్చయు లెఱుఁగు. ౫, ౬
ఆహారమును గూడ నందఱికిఁ దిగ
వెరవుల నయ్యెడుఁ బ్రియము, దానంబు
యజ్ఞంబు దపమును నట్టులె యౌను,
విను వాని యియ్యది భేదంబు నీవు. ౭
ఆరోగ్యమును సత్త్వ మాయువు బలముఁ
బ్రీతియు సుఖమును బెంచెడు నవియు,
సాత్త్వికుల కగు, రసములు హృద్యములు
స్థిరములున్ స్నిగ్ధ మౌ తిండ్లు ప్రియములు ౮
కట్వమ్లంబు రూక్షము లవణంబు
నత్యుష్ణమును విదాహంబు తీక్ష్ణంబు
నామయ దుఃఖ శోకానయము లగు

నాహారము లగుఁ బ్రియము రాజసులకు. ౯
ప్రాఁచి ముఱిగినది రసహీన మైన
యదియు నుచ్ఛిష్టంబు నపరిశుద్ధంబు
నైనది దుర్గంధ మైన దెయ్యదియొ
యా తిండి ప్రియ మైన యది తామసులకు. ౧౦
చేల్పఁగాఁ దగినదే జెన్నంబు నంచు
మది నిశ్చయంబు నమరఁజేసి ఫలము
నాస చేయనియట్టి యాతండు సల్పు
శాస్త్రదృష్ట మగు యజ్ఞంబు సాత్త్వికము. ౧౧
ఫలముఁ గోరియును దంభంబు కొఱకునె
కావించునట్టి యజ్ఞంబు రాజసము
నౌ ననియును భారతాధిప యెఱుఁగు ౧౨
శ్రద్ధలేనిది యమంత్రకము నన్నంబు
దానంబు లేనిద దక్షిణ మునుగ
నగు విధిహీనంబు నైనది యైన
యజ్ఞంబు తామసం బని పల్కఁబడెడు. ౧౩
దేవతల గురుల ద్విజులఁ బ్రాజ్ఞులను
గొలుచుటయును హింస కూర్పకయుంట
శౌచంబు మఱి బ్రహ్మచర్య మార్జవము
దైహికంబగు నట్టి తపము నాఁ బరగు
ప్రియము హితంబ నుద్వేగకరంబు
సత్యంబు నగు పల్కు స్వాధ్యాయము, నది

యభ్యసించుటె వాఙ్మయతపంబు నండ్రు. ౧౫
మనసు ప్రసాదముం భావ సంశుద్ధి
యాత్మనిగ్రహము సౌమ్యతయు మౌన మెది
మానసతపమునాఁ బల్కుదు రద్ది. ౧౬
యుక్తుల్ ఫలాపేక్ష యుండని నరులు
శ్రేష్ఠమౌ శ్రద్ధమై చేయు నా మూడు
విధముల తపము సాత్త్విక మని యండ్రు. ౧౭
సత్కారమాన పూజనముల కొఱకు
దంభంబుననె చేల్పు తపమిటఁ జలము
నధ్రువ మగుదాని నండ్రు రాజసము. ౧౮
మోటుపట్టునఁ దనఁ బొగలంగఁ జేయు
నదియు నొరుల చేటుకై చేల్పున దెది
యల్ల తపంబును నండ్రు తామసము. ౧౯
ఈయఁ గర్జంబని యెది యుపకారి
కాని వానికి దేశకాల పాత్రములఁ
గని యీఁ బడును సాత్త్విక మనఁబడు నది. ౨౦
ప్రత్యుపకారంబు *వడయఁగా నేని
ఫలము గోరియు నేని వడతోడ నిచ్చు
దానిని రాజస దానంబు నండ్రు. ౨౧
తగనట్టి కాలపాత్ర స్థానములను
సత్కరింపక యవజ్ఞమయి నొసంగు

* వడ = శ్రమము.

దాన మెయ్యది దానిఁ దామసంబండ్రు. ౨౨
'ఓ' మ్మని 'త' త్తని యును 'స' త్తని యగు
ము త్తెఱంగౌ నామములు బ్రహ్మమునకు,
దాని వలనను మొదట వేదములును
బ్రాహ్మణుల్ యజ్ఞముల్ వడియెనిర్మింప. ౨౩
బ్రహ్మవాదుల శాస్త్రపద్ధతిఁ జెరుగు
యజ్ఞ దానతపఃక్రియలు, కాన, నెపుడు
నడుచు నోంకారము న్బలికినవి యయి. ౨౪
'త' త్తని యొనరించెదరు ముముక్షువులు
ఫలము నాశింపక పలుతెఱంగులగు
దానక్రియల్ యజ్ఞతపముల క్రియలు. ౨౫
సద్భావమునఁ బార్థ, సాధుభావమున
నగుఁ బ్రయుక్తంబు 'స' త్తనునది,యట్లె
'స'చ్ఛబ్ద ముంత్రు ప్రశస్తకర్మముల. ౨౬
యజ్ఞదాన తపంబులం దుంట 'సత్తు'
ననఁబడును, దదర్థ మగు కర్మములును
సైతము 'స' త్తను సంజ్ఞనే పరగు. ౨౭
అశ్రద్ధతోఁ జేల్చునట్టి హోమంబు
దానంబు కర్మముం దప మెయ్యది యది
పార్థ, 'యస' త్తనఁ బడియెడు, నట్టి
యది యిక్కడకుఁ గాని యటకేనిఁ గాదు. ౨౮

పదునెనిమిదవ అధ్యాయము.

మోక్షసన్న్యాసయోగము.

అర్జునుఁడు పల్కె.

త్యాగంబుయొక్క సన్న్యాసంబుయొక్క
తత్త్వంబు నే విశదంబుగా నెఱుఁగ
వలతు హృషీకేశ, స్వామి, కేశిఘ్న, ౧

శ్రీభగవంతుఁడు పల్కె.

కామ్యంబు లగునట్టి కర్మముల్ విడుట
సన్న్యాస మందురు జ్ఞానులౌ వారు,
నఖిలకర్మఫలంబు *లఱుట త్యాగంబు
నని యు విచక్షణు లాడెదు వారు. ౨
కర్మంబు దోషంబుగా విడువంగఁ
దగునండ్రు బుధులు కొందఱు, లాఁతివారు
దానముల్ యజ్ఞముల్ తపములు నైన
కర్మముల్ త్యాజ్యముల్ గానివి యండ్రు. 3
ఆ త్యాగమున నిశ్చయంబును వినుము
చెప్పెదే భారతశ్రేష్ఠ, త్యాగంబు
పురుషవర, త్రివిధంబు లది నాఁ బడెఁగ. ౪
దానంబు యజ్ఞంబు దప మను†కఱత

---

* అఱుట=ఉజ్జనము. †కఱత = చెయ్యి.

కార్యంబె యగు, నది కాదు త్యాజ్యంబు;
దానంబు యజ్ఞంబు దపమును గూడఁ
బ్రాజ్ఞు లౌ వారికిఁ బావనంబు లగు. ౫
ఫలమును సంగముఁ బాసి యీ పనులు
సైతము చేలును జెల్ప నాఁ బార్థ
దృఢము నుత్తమము నయిన నాదు మతము. ౬
నియతకర్మంబుల నిలుపుట చేనదు,
వానిని మోహంబు వశమునఁ జేసి
త్యజియించు టందురు తామసం బనుచు. ౭
ఎవఁడు దుఃఖ మనియె యేది కర్మంబు
నొడలున కిడుమను *నుదురున విడుచు
నాతండు రాజసత్యాగంబు చలిపి
త్యాగఫలంబును నందఁగా లేఁడు. ౮
కార్యమే యనుచుఁ ద్యక్తఫలసంగ మయి
నియతకర్మం బెది నెఱవేర్పఁ బడెడుఁ
ద్యాగంబు సాత్త్వికం బది యని మతము. ౯
సత్త్వయుక్తుఁడు ఛిన్నసంశయుఁడు నయి
త్యాగియు మేధావి యగువాఁడు వాసి
యగు కర్మమున సక్తి నందఁడు వాసి
కాని కర్మమున సంగదయుఁ గొనండు. ౧౦
తుదముట్టఁ గర్మముల్ దొలఁగంగ రాదు

* ఉదురు = భయము.

గా! దేహికి నెవఁడు కర్మఫలంబు
ద్యజియించు నాతండు త్యాగి నాఁ బరఁగు. ౧౧
అత్యాగులకు మరణానంతరంబు
నిష్టంబు మిశ్రం బనిష్టంబు నాఁగఁ
గలదు ముత్తెఱఁగులఁ గర్మఫలంబు
సన్న్యాసులకునో పాసఁగ దెప్పు డేని. ౧౨
సాంఖ్యసిద్ధాంతంబు చాటెడు నన్ని
కఱతల సిద్ధి కీ కారణంబులను
నేనింటి బలశాలి యెఱుఁగునా వలన. ౧౩
కర్త, వేర్వేఱగు కరణముం, దనువు,
వివిధంబు లైనవి వేర్వేఱు లైన
కృత్యముల్, దైవంబె యేనవ దిందు. ౧౪
న్యాయ్యమే గాదేని నరుఁడు కర్మ మెది
వాఙ్మనఃకాయముల్ వలనఁ దొడంగు
నీ యైదు దానికి హేతువు లగును. ౧౫
ఇట్లిది యుండఁగా నెవఁడు కేవలము
తననె కర్తను గాఁగఁ దలఁచెడుఁ గుమతి,
మెఱుఁగిడ్డ బుద్ధి లేమిని వాఁడు కనఁడు. ౧౬
కలుగ దెవ్వని కహంకార భావంబు
కలుగదో యెవ్వాని *కఱదకుఁ †గసటు
నీ లోకులను జంపె నేనియు వాఁడు

* కఱద = బుద్ధి. † కసటు = మాలిన్యము.

కాఁడు చంపినవాఁడు, కాఁడు బద్ధుండు. ౧౭
జ్ఞానంబునుం బరిజ్ఞాత జ్ఞేయంబు
ననఁ గర్మచోదన మగు ముత్తెఱంగు,
కరణంబు కర్మము కర్తయును ననఁ
గా మూడు విధములు కర్మసంగ్రహము. ౧౮
గుణశాస్త్ర మందున గుణభేదములను
గని కర్త జ్ఞానము కర్మమును నని
ముత్తెఱంగులనె చెప్పుదు రాలకింపు
వానిఁగూడను నున్న వాని నున్నట్లు. ౧౯
నిఖిలభూతంబుల న్భిన్నంబు లందు
నవిభక్త మేకంబు నవ్యయం బైన
భావంబు నెఱుఁగఁగా బడు దేన నట్టి
జ్ఞానంబు నగు సాత్త్వికం బని యెఱుఁగు ౨౦
నిఖిలభూతంబులన్ భిన్నత్వమునను
వివిధభావములుగ వేఱ్వేఱుగఁ గను
జ్ఞానంబు నది రాజసం బని యెఱుఁగు. ౨౧
ఏకకార్యమునందుఁ గృత్స్నంబు గనెడి
సక్తంబు నల్పం బసత్యార్థ మైన
యది యహేతుక మది యంద్రు తామసము. ౨౨
ఫలము గోరని యట్టి వానిచే నేది
రాగసంగద్వేష రహితంబు గాను
నెఱవేర్పఁ బడునట్టి నియతకర్మంబు

నయ్యది సాత్త్వికం బైనది యండ్రు. ౨౩
కామంబునం గోర్కె గలయట్టి వాఁడు
గాని యహంకృతి గలవాఁడు గాని
యైనను బహుళప్రయాసంబు తోడఁ
జేల్పు కర్మము రాజసంబని యండ్రు. ౨౪
*అనుబంధ హింసాక్షయంబులను మఱి
పౌరుషంబును గాని పరికింపకుండ
మోహంబువలనను మొనయఁ బడు నెది
దానిని నందురు తామసం బనుచు. ౨౫
త్యక్తసంగుఁడు ననహంవాది ధృతియు
నుత్సాహములతోడ నుండు నాతండు
సిద్ధ్యసిద్ధులమార్పుఁ జెందని వాఁడు
నగుకర్త సాత్త్వికుం డనఁ గనుబడెడు. ౨౬
కర్మఫలాపేక్ష కలవాఁడు రాగి
హర్షశోకాన్వితుం డశుచి లుబ్ధుండు
హింసాత్మకుండు నయిన యట్టి కర్త
రాజసుం డనఁగను బ్రచురింపఁ బడెడు. ౨౭
స్తబ్ధుండ యుక్తుండు శఠుఁడు ప్రాకృతుఁడు
దీర్ఘసూత్రుఁడు విషాదియు †నైకృతికుఁడు
నలసుఁడౌ కర్తను నండ్రు తామసుఁడు. ౨౮

---

*అనవేక్ష్యచపౌరుషం. పా. అనపేక్ష్యచపౌరుషం.
†పా. నైష్కృతికుఁడు.

పార్థ గుణంబులం బట్టి, ముత్తెఱఁగు
పొసఁగెడు ధృతియొక్క బుద్ధియొక్కయును
భేదం బశేషంబు వేఱ్వేఱుగాను
జెప్పఁ బోయెద దానిఁ జెవిఁ బెట్టుకొనుము. ౨౯
బంధమోక్షంబులన్ భయ మభయముల
వృత్తినివృత్తుల విజయుఁడ, యేది
కార్యం బకార్యంబు కనుగొని యెడునో
యలబుద్ధి సాత్త్వికం బైనట్టి దగును. 3౦
కాంచుఁ గార్యంబు నకార్యంబు మఱియు
ధర్మంబు మఱియు నధర్మంబుఁ గూడ
నున్న దున్నట్లుఁ గాకుండఁగాఁ దేన
నా బుద్ధి యర్జునా యగు రాజసంబు. 3౧
తలఁచు నధర్మంబు ధర్మంబు నాఁగ
నజ్ఞానమున మున్గి యఖిలార్థములను
దరిసించును విపరీతములుగా నేది
యాబుద్ధి యర్జునా, యగుఁ దామసంబు. 3౨
తొలఁగని యోగంబుతో ధరియింప
నగు మనఃప్రాణేంద్రియక్రియల్ దేన
నల ధృతి పార్థుఁడ, యగు సాత్త్వికంబు. 33
సంగంబునను ఫలాశ గలవాఁ డగుచే
ధర్మకామార్థముల్ ధరియించు దేన
నల ధృతియును బార్థ యగు రాజసంబు. 3౪

స్వప్నంబు భయము విషాదంబు మదముఁ
* దెగఁడె శోకంబునుం దేనఁ గుబుద్ధి
యలధృతి యర్జునా, యగుఁ దామసంబు. ౩౫

ముత్తెఱంగుల సుఖమును నిప్పు డీవు
భరతర్షభ, విను నా వలన, దేన. నగు
నభ్యాసమున సుఖ మడఁగు దుఃఖంబు. ౩౬

అయ్యెడు నెయ్యది యాదిని విషము
నట్టులఁ దుదియందు నమృతంబు నట్లు,
చను నాత్మబుద్ధిప్రసాదజ మగుచే
నల్ల సుఖంబును నండ్రు సాత్త్వికము. ౩౭

అయ్యెడు విషయేంద్రియముల కలయిక
వలనను నమృతంబు పగిదిని మున్ను
నంతమం దునవిషం బ ట్లెద్ది యల్ల
సుఖము రాజసము నంచుఁ దలంపఁబడును. ౩౮

మునుపును దుదియందు మోహంబు నాత్మ
నలముఁ, బ్రమాద నిద్రాలస్యములను
బుట్టిన యట్టి దవు నల సుఖంబు
తామసం బనుచే నుదాహృతం బగును. ౩౯

ఈ ప్రకృతిజము లయిన త్రిగుణముల
వలన ముక్త మగు సత్త్వం బెది లేదు
భువియందు దివిని దేవుల యందె కాని. ౪౦

---

* తెగఁడె = ఊడఁడే.

బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రులకుఁ
గర్మంబులును విభక్తంబు లైన యవి
సవ్యసాచి, స్వభావజ గుణము లంటి. ౪౧
శమమును దమమును శౌచంబు తపము
క్షాంతి విజ్ఞానంబు జ్ఞాన మాస్తికత
యార్జవంబును ననునట్టి కర్మములె
బ్రాహ్మణులకును స్వభావజంబు లగు. ౪౨
తేజంబు శౌచంబు ధృతియు దాక్ష్యంబు
శౌర నోడమి దానమును నీశతయును
క్షత్రియుల స్వభావ జాతకర్మములు. ౪౩
వైశ్యునకు నగును వాణిజ్యము కృషి
పసులఁ బ్రోచుట స్వభావజపు కర్మంబు
గాఁ, పరిచర్యాత్మక మగు కర్మంబు
నగు స్వభావజము నౌ నది శూద్రునకును. ౪౪
తన తన కర్మముఁ దవిలిన నరుఁడు
కాంచు సిద్ధిని, నిజ కర్మనిరతుఁడు
విను మెట్లు సిద్ధిని బెరయును దాని. ౪౫
ప్రభవించు నెవ్వాని వలన భూతములు
నెవ్వానిచే వ్యాప్త మీ యఖిలంబు
వానిఁ స్వకర్మంబు వలన నరుండు
నర్చించి సిద్ధిని నందెడి వాఁడు. ౪౬
తనరఁ జెల్పిన పరధర్మంబు కన్న

స్వీయధర్మము మేలు విగుణమేఁ గాదు
అఘము స్వభావనియతకర్మముఁ గొన. ౪౭
సకలుషం బేనియుఁ సహజకర్మంబు
రాదు విడువఁగ; నా రంభంబు లెల్ల
యగ్ని ధూమంబుచే నట్టులఁ గాదె
దోషంబు నందునఁ దోఁగి యున్నయవి. ౪౮
స్పృహ లేని వాఁడ, న్నిటెడ నసక్తుఁ డగు
వాఁడు, జితాత్ముండు, పరమంబు నైన
నైష్కర్మ్యసిద్ధి సన్న్యాసమునఁ గను. ౪౯
జయ, సిద్ధుఁ డగు వాఁడు జ్ఞానంబునకును
బరమఫలంబైన బ్రహ్మంబు నెట్లు
కాంచు సంక్షేపంబుగఁ గనునా వలన. ౫౦
పరిశుద్ధ మౌ బుద్ధి వహియించి, యాత్మ
ధృతివలనను నిల్పి, ద్వేషరాగముల
విడిచి, శబ్దాదు లౌ విషయముల్ గడచి. ౫౧
ఏకాంతభూమి వసించు వాఁ డగుచు,
యతవాఙ్మనఃకాయుఁడై మితభుక్కు
నగు వాఁడు, ధ్యానయోగాసక్తుఁ డెపుడు
నగు వాఁడు, కామం బహంకారములను
దర్పంబు బలము క్రోధము, పరిగ్రహము
తొలఁచిన యతఁడు, శాంతుండు, నిర్మముఁడు,
వైరాగ్యమును లెస్స పట్టిన వాఁడు,

నగు వాఁడు, బ్రహ్మంబు నందఁగాఁ గలఁడు.
అయి బ్రహ్మభూతుండు నై ప్రసన్నాత్మ
కలవాఁడు, కొనఁడు శోకంబును గాంక్ష,
సర్వభూతంబుల సముఁడయి, కలఁడు
పరమ మా నాయెడ భక్తిని బడయ. ౫౨-౫౪

ఎట్టి వాఁడను నాదు నెవ్వండ నేను
భక్తి నన్నెఱుఁగుఁ దత్త్వముగ నవ్వలను,
నను దత్త్వముగఁ గాంచి నను జొచ్చునంత. ౫౫
కర్మంబు లన్నియుం గావించు చెపుడు,
నాశ్రయించిన వాఁడు నై కడు నన్ను,
స్థిరమైన కొఱలేని సీమను నాది
యగు ప్రసాదంబుచే నందఁగాఁ గలఁడు. ౫౬
బుద్ధియోగంబు ప్రాపు నధిగమించి
మానసంబునను గర్మంబుల నెల్ల
వదలి నాయందు, మత్పరుఁడవు నగుచుఁ
జిత్తంబు నాయందుఁ జేర్పు మెల్లపుడు. ౫౭
మచ్చిత్తుఁ డవు నయి మత్ప్రసాదమునఁ
గలవు దాఁటంగ సకల దుర్గముల,
హంకారమున వినవైనఁ జెడెదవు. ౫౮
హంకార మూని పోరా డనునంచు
నెంతువే నీదగు నీ నిశ్చయంబు
వ్యర్థ మా నది, నిన్నుఁ బ్రకృతి నేమించు. ౫౯

బద్ధుండ వయి నీ స్వభావజం బైన
కర్మంబుచేతను, గావింపఁగాను
వలవనే మోహంబు వలనను, నద్ది
పార్థ, కావింతు వవశుఁ డవు నయిరొ. ౬౦

యంత్రమం దట్లున్న యఖిలభూతముల
నడపుచు మాయచే నర యుండు విభుఁడు
నెల్ల భూతంబుల హృద్దేశ మందు. ౬౧

వానినే సర్వభావంబునఁ బార్థ,
దరిచేరు తత్ప్రసాదమున శ్రేష్ఠ మగు
శాంతియు శాశ్వత స్థాన మొందెదవు. ౬౨

గుహ్యంబు లందును గుహ్యతరంపు
జ్ఞానంబు నీకు నేఁ గఱపితి నిటుల
నియ్యది తుదముట్ట నెన్నిక చేసి
యిష్టమయిన విధం బెది యట్లు సలుపు. ౬౩
ఈవు నా *ఇరవైన యిష్టుండ వగుట
నీకు హితంబు వినిచెదను మరల
నన్నింటిలోన గుహ్యతమంబు నైన
పరమంబు నైన నా వచనంబు వినుము. ౬౪
నను గొల్చు వాఁడవు, నా భక్తుఁడ వగు
మెద నన్నుఁ గలవాఁడ, వేఱఁగుము నాకు,

* ఇరవు = స్థిరము.

నన్నె ప్రాపించెదు, నాకుఁ బ్రియుఁడవు
నీవు, సత్యము, నీకు నిచ్చెద మాట. ౬౫
సర్వధర్మంబులం జాలించి నన్ను
శరణొందు మొకనినే, సకలపాపముల
వలన ని *న్నురలింతుఁ, బనిలేదు వగవ. ౬౬

ఇయ్యది నీ కగు, నెప్పు డేనియును
భక్తిహీనున కతపస్కున కేని
గాని శుశ్రూషను గావింప నట్టి
వానికి నేనియు వచియింప రాదు. ౬౭

అధికంబును రహస్య మగు దీని నాదు
భక్తుల కెవ్వఁడు వచియించు వాఁడు
పరమ మగు భక్తి నా పైనఁ గావించి
నన్నె ప్రాపించు సంశయమును లేదు. ౬౮

నరులందు వానికన్నను నెచ్చు ప్రియము
కొలుపు నాతండు నాకు నెవఁడు లేఁడు.
ఆతనికన్నఁ బ్రియతరుండు నాకు
భువిలోనఁ గలుగఁగాఁ బోవఁడు గూడ. ౬౯

మనది యీ ధర్మ్యసంవాదంబు నెవఁడు
చదువును వానిచే జ్ఞాన యజ్ఞమున
నేను †నిష్టము నాచరింపఁగాఁ బడిన .

* ఉరలు=వీడు. †ఇష్టము = యజ్ఞకర్మము.

వాఁడ నౌదును నాదు భావ మిట్టియది. ౭౦
ఎవ్వాఁ డసూయారహితుఁడు శ్రద్ధగల
వాఁడై విను నతఁడుం బడయు ముక్తుఁడయి
పుణ్యకర్ములవి యగు శుభలోకముల. ౭౧
ఏకాగ్రచిత్తంబు నెనసి నీచేత
నిది విశ్రుతం బాయె నే పార్థ, నీదు
నజ్ఞాన సమ్మోహ మడఁగెనే విజయ. ౭౨

అర్జునుఁడు పల్కె.

నీప్రసాదంబునఁ దెలివిని గాంచి,
నిలిచితి వీడి సందియము, మోహంబు
వదలెఁ గావింతు నీ వచనంబు నేను. ౭౩

సంజయుండు పల్కె.

ఆలించితి మహాత్ముఁడైన పార్థునియు
వాసుదేవునియు సంవాద మి దిట్లు
నద్భుతంబును రోమహర్షణంబుగను. ౭౪
కృష్ణుండు యోగేశుఁ డీ గుహ్యతమము
పరమ మౌ యోగంబుఁ బ్రత్యక్షముగను
వచియింపఁ దాఁ వింటి వ్యాసుని దయను. ౭౫
అద్భుతంబును బుణ్య మౌ కేశవు నిది
నరుని యీ ముచ్చటఁ దలఁచి తలంచి
పొరిఁ బొరి రాజ, సమ్మోద మందెదను ౭౬

శుద్ధపత్రము.

పుట.	పఙ్క్తి.	తప్పు.	ఒప్పు.
౯	౧౪	౦డి కృ	నఁ గృష్ణ
౧౬	౨	డును	దును
౧౮	౯	వల్లైన	వక్లైన
,,	౧౪	చెడడిందు	చెడదెందు
,,	౨౧	బనె	బనెడి
౩౧	౧౭	శ్రీ	శ్రీ
౫౦	౧౨	జయ	నర
౫౭	౬	జయ, సర్వభూతముల్	సర్వభూతమ్ములు
౬౪	౯	బ్రళయము	బ్రలయము
,,	౨౨	మూఢజనులు	మూఢులునరు
౬౫	౪	రుంద్రు	రుంద్రు
౭౦	౧౮	యాత్ముల	యాత్మల
౮౦	౧౩	గంగర్వ	గంధర్వ
౮౩	౪	సైంధవుఁడు	సంజయుఁడు
౧౦౪	౧౩		లోకంబు (సరి)
,,	౨౦	బృథా	బృథా
౧౦౬	౧౬	ప్రళయాంత	ప్రలయాంత
,,	౧౯	నిచ్చిన	నచ్చిన
౧౨౧	౧	క్షత్రియ	క్షత్త్రియ
,,	౩	సకౄసాచి	సవ్యసాచి
,,	౧౦	క్షత్రియు	క్షత్త్రియు
,,	౧౩	పరిచర్యా	బరిచర్యా
౧౨౨	౧౦	జయ,సిద్ధుఁ డగువాఁడు	కౌంతేయ,సిద్ధుఁ

అత్యద్భుతం బైన హరిది యారూపుఁ
దలఁచి తలంచి యదనము విస్మయము
నగు నాకు మఱి మఱి యలరుదు రాజే. ౭౭

ఎచట యోగేశుఁడౌ కృష్ణుండు నెచట
వింటిని బూనిన విజయుండు నుండు
నచట శ్రీయును విజయము భూతి నీతి
దృఢముగా నుండెడు నిది నాదు మతము. ౭౮

ఇది

శ్రీ వెలమకుల శేఖర మట్నూళ్ల గోత్రపయఃపారావార
సుధాకర పానగంటి వంశతిలక వేంకటరంగధాత్రీ
కళత్ర పుత్ర, బుధజనవిధేయ, పార్థసారధి
రాయాభిధేయ ప్రణీతంబైన
శ్రీ భగవద్గీతామంజరి
సమాప్తము.

చెన్నపురి, తండయార్పేట : శ్రీ 'రామ' ప్రెస్సున ముద్రితము—1931